
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
శనివారం 14 జూన్ 2025 | 5





కాకినాడలో జాబితా తనిఖీ

అమ్మలకు.. ఆనందం!



చంద్రన్నకు తల్లుల వందనాలు

(రాజమహేంద్రవరం/అమలాపురం/ కాకినాడ- ఆంధ్రజ్యోతి)

చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారు.. అమ్మల కళ్లల్లో ఆనందం చూశారు. 'తల్లికి వందనం' డబ్బులు తల్లుల ఖాతాల్లో జమ కావడం శుక్రవారం నుంచి ఆరంభమైంది. గురువారం జమ అవుతాయని చెప్పినా అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదం రూపంలో అనుకోని విపత్తు సంభవించడంతో ఒకరోజు ఆలస్యమైంది. చంద్రబాబు చెప్పిన విధంగానే ఎందరు పిల్లలు (విద్యార్థులు) అంతమందికీ ఖాతాల్లో జమ అవుతున్నాయి. ఒకటో తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి ఏడాది అడ్మిషన్లు జరుగుతున్న కారణంగా వారికి తర్వాత ఇస్తారు. ఇప్పుడు రెండో తరగతి నుంచి పది, ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు సంబ ంధించి వారి తల్లుల ఖాతాల్లో ఒక్కొక్కరికీ రూ.13 వేలు చొప్పున జమవుతున్నాయి. రూ.2 వేలను పాఠశాల నిర్వహణ నిమిత్తం మినహాయిస్తున్నారు. ఇద్దరు పిల్లలుంటే రూ.26 వేలు.. ముగ్గురు పిల్లలుంటే రూ.39 వేలు ఖాతాల్లో జమ చేశారు. ఆ మెసేజ్‌సెల్‌కి రావడంతోనే కుటుంబం ఎగిరి గంతేసినంత పనిచేస్తోంది.

5.80 లక్షల మంది విద్యార్థులు

ఉమ్మడి తూర్పుగోదావరిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో సుమారు 5.80 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం దాదాపు రూ.800 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) విధానం కావడంతో ఒకేసారి అంత మొత్తాన్ని ఆయా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తే సాంకేతిక ఇబ్బం దులు తలెత్తుతాయి. సర్వర్లు మొరాయిస్తాయి. అందువల్ల అర్హులైన ప్రతి ఒక్కరి ఖాతాల్లో గంటల తేడాతో సొమ్ము జమవుతోంది. ఈ ప్రక్రియ వచ్చే నెల 5 వరకూ కొనసాగనుంది. తూర్పు గోదావరి జిల్లాలో 1,88,226 మంది విద్యార్థులకు సంబంధించి 1,23,779 మంది తల్లుల ఖాతాల్లో సుమారు రూ.240 కోట్లు, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1,70869 మంది పిల్లలకు సంబంధించి 1,12,419 మంది తల్లుల ఖాతాల్లో రూ.250 కోట్లు, కాకినాడ జిల్లాలో 2,28,780 మంది విద్యార్థులకు సంబంధించి 1,49,400 మంది తల్లుల ఖాతాల్లో రూ.340 కోట్లు జమ కానున్నాయి.

సచివాలయాల వద్ద క్యూ

సచివాలయాల వద్దకు ప్రజలు పదుల సంఖ్యలో చేరుకుని అర్హత జాబితాలను పరిశీలించుకునే పనిలో బిజీబిజీగా ఉన్నారు. కొందరు అనర్హుల జాబితాలో ఉండడంతో కారణాల అన్వేషణలో పడ్డారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అత్యధికులు విద్యుత్ బిల్లుల షాక్ వల్ల అనర్హుల జాబితాలోకి వెళ్లిపోయారు. ఏడాదిని యావరేజ్ చేసి విద్యుత్ బిల్లులు నిర్ధారించడంతో ఈసారి ఎక్కువ మంది లబ్ధిదారులు అర్హత సాధించకుండాపోయారు. పి.గన్నవరం మండలం లంకలగన్నవరం గ్రామానికి చెందిన 178 మందికి విద్యుత్ బిల్లుల షాక్ కారణంగా అనర్హులుగా పరిగణించబడ్డారు. వీరంతా గన్నవరంలోని విద్యుత్‌శాఖ కార్యాలయానికి వచ్చి ఏడాదిని యావరేజ్ చేయించుకుని విద్యుత్‌శాఖ నుంచి సర్టిఫికెట్లు తీసుకునే పనిలో నిమగ్నమయ్యారు. మరో వైపు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాలకు కొందరు చేరుకుని తమ పేరున

- మాట నెరవేర్చిన ప్రభుత్వం
- తల్లుల ఖాతాల్లో నగదు జమ
- ఉదయం నుంచి ఫోన్లకు మెసేజ్‌లు
- సచివాలయాల్లో అర్హుల జాబితా
- ఎగిరి గంతేసిన అర్హులు
- 20 వరకు అభ్యంతరాల స్వీకరణ
- 28న మరొక జాబితా ప్రదర్శన
- 30న ఒకటి, ఇంటర్ విద్యార్థులకు

నాలుగు చక్రాల వాహనాలు ఉండడం వల్ల అనర్హత జాబితాలో ఉన్నామని.. తమకు ఏమీ లేవని క్లియరెన్స్ సర్టిఫికెట్లు కావాలంటూ కార్యాలయాల చుట్టూ తిరగడం ప్రారంభించారు. ఒక చోట మ్యాపింగ్ పూర్తయిన తర్వాత మరో చోటకు ఇల్లు మారిన వారు అయోమయానికి గురవుతన్నారు. తాము ప్రస్తుతం నివాసం ఉంటున్న పరిధిలోని సచివాలయంలో పిల్లల పేర్లు లేకపోవడం, ఎక్కడ జాబితాలో ఉన్నాయో తెలియకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. సచివాలయాల్లో జాబితాలు ప్రదర్శించారన్న సమాచారం ఇప్పుడిప్పుడే గ్రామాల్లో ప్రజలకు చేరుతుంది. రెండో శనివారం సెలవు, ఆదివారం సెలవు దినాలు కావడంతో లబ్ధిదారులు మళ్లీ సోమవారం వరకు తమ భవిష్యత్తును పరీక్షించుకునేందుకు రెండు రోజులపాటు వేచి చూడాల్సిందే. నిధులు పొందిన వారిలో ఆనందం కనిపిస్తుంటే, అనర్హుల్లో మాత్రం ఆవేదన వ్యక్తమవుతోంది.



తల్లికి వందనం నగదు జమ సందర్భంగా కాకినాడ పెగోడా స్కూల్‌లో సీఎం చిత్రపటానికి పాలభిషేకం

నగదు జమకాకపోయినా కంగారుపడొద్దు!

సచివాలయాల్లో శుక్రవారం నుంచి అర్హులు, అనర్హుల జాబితా ఉంచారు. అభ్యంతరాలు, వినతులు ఈనెల 20వ తేదీలోపుగా ఆయా సచివాలయాల ద్వారా సమర్పించాలి. మరొక అర్హుల జాబితా 28వ తేదీలోపుగా రూపొందిస్తారు. ఒకటో తరగతి, ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు సంబంధించి ఈనెల 30న జాబితాలు ప్రదర్శిస్తారు. మొత్తం తల్లికి వందనం నగదు జమ ప్రక్రియ వచ్చే నెల 5వ తేదీతో పూర్తి చేస్తారు. అర్హుల జాబితాలో ఉంటే సొమ్ము ఖచ్చితంగా జమవుతుందని అధికారులు చెబుతున్నారు. అనర్హత జాబితాలో ఉన్నవారు నిరాశకు గురైనా గ్రీవెన్స్‌కి సమయం ఉందని సూచిస్తున్నారు. ఇప్పుడు ప్రకటించినది మొదటి లిస్టు.. సమస్యల పరిష్కారం తర్వాత రెండో లిస్టు ప్రకటిస్తారని చెబుతున్నారు. ఆధార్ తదితర సమస్యలు ఉంటే సరిచేసుకోవాలంటూ ఇప్పటికే ఆయా పాఠశాలలకు జాబితాలు వెళ్లాయి. దీంతో పాఠశాలల సిబ్బంది తల్లులకు సమాచారం ఇస్తున్నారు. ప్రతి తల్లి లేదా సంరక్షకుడు ఆధార్ సీడింగ్ పూర్తి చేసుకున్న బ్యాంకు ఖాతాకే డబ్బులు జమవుతాయి. సింగిల్ పేరెంట్ తండ్రి ఉంటే అతని ఖాతాకు డబ్బులు వెళతాయి.అనాథ పిల్లల నగదును కలెక్టర్ల ఖాతాల్లో జమ చేసి పరిశీలన అనంతరం అందజేస్తారు. ఇప్పటికే అర్హులకు సంబంధించిన నగదును బ్యాంకులకు ప్రభుత్వం పంపించింది.



నలుగురికి రూ.52 వేలు..

మాది పెరవలి మండలం కానూరు అగ్రహారం.. మా నలుగురు పిల్లలు.. రూ.52 వేలు మా అకౌంట్‌లో పడ్డాయి. ఒకేసారి ఇంత పెద్ద మొత్తం మా అకౌంట్‌లో పడడం తొలిసారి. చాలా ఆనందంగా ఉంది. గతంలో కేవలం ఒక్కరికి మాత్రమే వచ్చేవి. సీఎం చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారు.

- మిండాల శివయ్య, ధనలక్ష్మి, కానూరు



ఆధార్ లింకైతే నలుగురికి...

మాకు నలుగురు పిల్లలు. సాకుర్రు జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. గతంలో అమలాపురంలో ఉండేవాళ్లం. రేషన్‌కార్డు అక్కడే ఉంది.బ్యాంకుఖాతాకు ఆధార్ అనుసంధానం కాలేదు.దీంతో నిలిచిపోయింది. అనుసంధానమైతే తల్లికి వందనం వస్తుందని విద్యాశాఖాధికారులు తెలిపారు.

- జి.శ్రీనివాసరావు,శాంతికుమారి, సాకుర్రు



అమ్మ లేకున్నా.. నానమ్మకు..

తల్లి లేని ముగ్గురు పిల్లలకు రూ.39 వేలు జమైంది. ఆనందంగా ఉంది. మా అబ్బాయి దిమ్మిలి దేవదాసు వ్యవసాయ కూలీ. కొంత కాలం కిందట అతని భార్య చనిపోయింది. దీంతో ముగ్గురు పిల్లల సంరక్షణ నేనే చూస్తున్నా.ఇచ్చిన మాటకు కట్టుబడి సొమ్ములు వేసిన కూటమి ప్రభుత్వానికి ఇదే మా వందనం.

- నాయనమ్మ సుబ్బలక్ష్మి, చిన్నారులు

మా పిల్లల చదువుకు వినియోగిస్తాం..



నా ముగ్గురు పిల్లలకు రూ.39 వేలు జమయ్యాయి. ఆనందంగా ఉంది. మాది బిక్కవోలు మండలం రంగాపురం..శుక్రవారం ఉదయం మెసేజ్ వచ్చింది. ఏమిటా అని చూస్తే రూ.39 వేలు జమయ్యాయి. సొమ్ము బ్యాంకులోనే ఉంచి మా పిల్లల చదువుకు వినియోగిస్తాం.

- తనుబోయిన అనూష, వెంకటరమణ, బిక్కవోలు

ముగ్గురికి రూ.39 వేలు పడ్డాయి..



చంద్రబాబు చెబితే చేస్తారని తెలుసు.. బాబును నమ్మాం.. బాగుపడుతున్నాం.. మాది కడియం మండలం దుళ్ళ.. నా పేరు తొట్టా స్వాతి. నా భర్త సత్తిబాబు ఆటో డ్రైవరు.. మాకు ముగ్గురు అమ్మాయిలు...నా ఖాతాలో రూ.39 వేలు జమయ్యాయి. చాలా సంతోషంగా ఉంది.

- తొట్టా స్వాతి, సత్తిబాబు, దుళ్ళ

అన్నమాట నిలబెట్టుకున్నారు...



పాఠశాలల ప్రారంభం మరుసటి రోజునే తల్లికి వందనం వేయడం ఆనందంగా ఉంది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని, అన్నమాట నిలబెట్టుకున్నారు. మా ముగ్గురు కుమార్తెలకు రూ.39 వేలు పడ్డాయి.

- ఎస్.శ్రీనివాసరావు, త్రిలోకసుందరి, గంగలకుర్రు (పెదపాలెం)

చంద్రన్నకు వందనం



మాకు ఇద్దరు ఆడపిల్లలు, ఒక అబ్బాయి.. శుక్రవారం ముగ్గురికి అమ్మకు వందనం సొమ్ము జమైంది. దీంతో మా కుటుంబం ఎంతో ఆనందంగా ఉంది. గత ప్రభుత్వంలో మణికంఠకు మాత్రమే ఇచ్చారు.

- ఉప్పు నాగరాజు,నాగమహాలక్ష్మి, గొల్లవిల్లి, ఉప్పలగుప్తం

రూ.39 వేలు..చదువులకే ఖర్చు చేస్తాం..



మాకు ముగ్గురు పిల్లలు. ముగ్గురు బంగారు తల్లులే. శుక్రవారం రూ.39 వేలు పడ్డాయి. ఎంతో ఆనందం కలిగింది. గతంలో ఒకరికే పడేది.. ఇప్పుడు ముగురికి డబ్బులు పడ్డాయి. వారి చదువుకే ఖర్చు చేస్తా.

- త్రినాథుల శివశంకర్, మల్లిక దంపతులు, దుర్గాడ

ఇది మంచి ప్రభుత్వం



మాది కాకినాడ జగన్నాథపురం. మాకు ఇద్దరు అమ్మాయిలు. రౌతు అవంతిక, రౌతు నక్షత్ర. కాకినాడ గొడారిగుంటలో చదువుతున్నారు. మా ఇద్దరు పిల్లలకు ఇచ్చారు. ఇది మంచి ప్రభుత్వం. చాలా సంతోషంగా ఉంది. చంద్రబాబు హామీ ఇచ్చారు.. నెరవేర్చారు.

- రౌతు సంధ్యాకుమారి, జగన్నాథపురం, కాకినాడ

ఎస్సీ విద్యార్థులకు జమకాలేదు..

రాజమహేంద్రవరం అర్బన్/ కాకినాడ కార్పొరేషన్, జూన్13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతున్న అర్హులైన ఎస్సీ విద్యార్థినీ.. విద్యార్థులకు తల్లికి వందన పథకంలో డబ్బులు వారి బ్యాంకు అకౌంట్‌కు జమ కాలేదని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు ఎంఎస్ శోభారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాలో 2,660 మంది, కాకినాడ జిల్లాలో 2367 మందికి సొమ్ములు జమ కాలేదని పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 8, 9 తరగతులు చదువుతున్న ఎస్సీ విద్యార్థులు 557 మంది తల్లుల అకౌంట్‌కు ఇంకా డబ్బులు జమ కాలేదన్నారు. అదే విధంగా కాకినాడ జిల్లాలో 9,10 తరగతి చదువుతున్న విద్యార్థులు 500 మందికి వారి తల్లుల ఖాతాల్లో జమ కావాల్సి ఉందన్నారు. తల్లికి వందనం డబ్బులు జమకాని తల్లిదండ్రులు కంగారుపడాల్సిన అవసరం లేదన్నారు. వెంటనే దగ్గరలో ఉన్న గ్రామ, వార్డు సచివాలయాల్లో సంప్రదించాలన్నారు. ముందుగా సమస్య ఏమిటనేది తెలుసుకోవాలన్నారు. అనంతరం సమస్య పరిష్కారానికి చర్యలు చేపడితే రెండో విడతలో వస్తుందన్నారు.అర్హుల జాబితాలో ఉండి సొమ్ములు పడకపోయినా ఇబ్బందిలేదన్నారు.



నేడు సచివాలయాల్లో ప్రత్యేక మేళా

సచివాలయాల్లో శనివారం ఉదయం 11 గంటలకు మేళా నిర్వహిస్తున్నారు. సచివాలయం వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్/ వార్డు ఎడ్యుకేషనల్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీని సంప్రదించాలి. అర్హుల జాబితాలో ఉన్నా సొమ్ము పడక పోవడానికి ప్రధాన కారణం.. నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)లో ఆధార్‌ను అనుసంధానం చేసుకోకపోవడమే.బ్యాంకు అకౌంట్ ఉన్న వారు ఎన్‌పీసీఐకి ఆధార్ అనుసంధానం చేసుకుంటే ప్రభుత్వ పథకాలకు సం బంధించిన సొమ్ములు జమవుతాయి.అయితే కాస్త సమయం పడుతుందని సమాచారం. తల్లికి వందనం పథకంలో ఆర్థిక సహాయం పొందడానికి పోస్టాఫీసులో ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకు (ఐపీపీబీ)లో అకౌంట్ ఓపెన్ చేసుకుంటే నగదు జమవుతుందని చెబుతున్నారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు పోస్టాఫీసులో అకౌంట్ ఓపెన్ చేసుకోవడంతోపాటు ఎన్‌పీసీఐలో ఆధార్ అనుసంధానం చేసుకోవాల్సి ఉంటుంది.



యోగాసనాలు వేస్తున్న పోలీస్ సిబ్బంది

యోగా సాధనతో ఒత్తిడి నుంచి ఉపశమనం

కాకినాడ క్రైం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): యోగా సాధనతో ఒత్తిడి నుంచి ఉపశమనం కలుగుతుందని ఎస్పీ జి.బిందుమాధవ్ అన్నారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు సామూహిక యోగా అభ్యాసం నిర్వహించారు. యోగా కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని మానసిక ప్రశాంతత, ఒత్తిడి నియంత్రణకు ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. నిత్యం ఒత్తిడికి లోనయ్యే పోలీస్ సిబ్బందికి యోగా ఎంతో అవసరమన్నారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్.శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ శ్రీహరిబాబు, అడ్మిన్ ఆర్ఐ మూర్తి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇక అన్నదాతలకు ఆర్థిక భరోసా!

సూపర్ సిక్స్ పథకాల అమలుతో కూటమి ప్రభుత్వం దూసుకుపోతోంది. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టుగానే పథకాల సొమ్ములను ఆయా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తోంది. ఇప్పటికే ఈ నెలలో 'తల్లికి వందనం' పేరుతో విద్యార్థుల తల్లుల ఖాతాలో సొమ్ము జమ చేయగా.. ఈనెల 20వ తేదీన అన్నదాతల ఖాతాలో సొమ్ములు వేయనుంది.

- వారి ఖాతాల్లో సొమ్ము జమచేయనున్న కూటమి ప్రభుత్వం
- ఈనెలలో రూ.20 వేలు అందజేసేందుకు సిద్ధం

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

అన్నదాతా సుఖీభవ- పీఎం కిసాన్ పథకం అమలుకు రంగం సిద్ధమైంది. ఈ పథకానికి సంబంధించి కాకినాడలో 1,49,831 మంది రైతు కుటుంబాలను అర్హులుగా గుర్తించారు. వీరికి ఏడాదికి రూ.20 వేల చొప్పున మూడు విడతల్లో లబ్ధి చేకూరనుంది. పీఎం కిసాన్ కింద ఈనెల 20న ఒక్కో రైతు కుటుంబానికి రూ.రెండు వేల చొప్పున విడుదల చేయనుందని రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందింది. అదేరోజు రాష్ట్ర ప్రభుత్వం కూడా రూ.ఐదు వేల చొప్పున జమచేయనుంది. అంటే తొలివిడతలో రైతులకు రూ.7వేలు అందుతాయి. రెండో విడతగా అక్టోబర్‌లో రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదు వేలు, కేంద్రం రూ.రెండు వేలు కలిపి రూ.ఏడు వేలు, మూడో విడతగా వచ్చే జనవరిలో రాష్ట్రం రూ.నాలుగు వేలు, కేంద్రం రూ.రెండు వేలు కలిపి రూ.ఆరు వేలు ఇలా మొత్తం రూ.20 వేలు ఏడాదికి అందజేస్తారు.

ఈకేవైసీ పూర్తి చేశాకే..

కమతాల వారీగా చూస్తే జిల్లాలో 1,70,767 మంది రైతులు ఉన్నారు. వీరిలో ప్రజాప్రతినిధులు, ఆదాయ పన్ను చెల్లించేవారు, వ్యవసాయేతర అవసరాలకు భూములు వినియోగించేవారు తదితర విభాగాల వారికి మినహాయించారు. మొత్తం లక్షా 49 వేల 831 మంది రైతులు అన్నదాతా సుఖీభవ పరిధిలోకి వస్తారని రైతు సేవా కేంద్రాల పరిశీలనలో తేలింది. అయితే ఈకేవైసీ పూర్తి చేసిన రైతుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ కానున్నాయి. అటవీ భూముల పట్టాలు పొందిన (ఆర్ఓఎఫ్ఆర్) రైతులకు కూడా సాయం అందజేస్తారు.

కౌలు రైతుల ఖాతాల్లోనే..

కౌలు రైతులకు కూడా ఈ పథకం వర్తించనుంది. పంటకాలం మొదలయ్యాక వారిని గుర్తించి జాబితాలు తయారుచేస్తారు. తరువాత వారికి అన్నదాతా సుఖీభవ కింద రాష్ట్ర ప్రభుత్వమే రూ.20 వేలు చొప్పున ఇవ్వనుంది.

ఎంపిక జరిగింది ఇలా..

జీఎస్‌డబ్ల్యూఎస్ సర్వే, మీభూమి పోర్టల్, ఆదాయపు పన్ను చెల్లింపుదారు ద్వారా ధ్రువీకరించారు. కమిషనరేట్‌లో ఆర్‌టీజీఎస్ ద్వారా డేటాను ధ్రువీకరించి, అర్హత కలిగిన రైతుల జాబితాను మండలాలకు పంపారు.



కాకినాడ కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సాంఘిక సంక్షేమ శాఖ డీడీ శోభారాణి, పెద్దాపురం డీఎల్‌డీవో ఎం.శ్యామల, జిల్లా ఇన్‌చార్జి డీసీవో పీబీఎంఎం.కుమార్ - కాకినాడ కలెక్టరేట్



సాంఘిక సంక్షేమశాఖ డీడీగా శోభారాణి

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 13(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీగా ఎంఎస్ శోభారాణి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. తూర్పుగోదావరి జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీగా పనిచేస్తూ బదిలీపై కాకినాడ వచ్చారు. ఆమె గతంలో ఉమ్మడిగోదావరి జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీగా 2017 అక్టోబరు నుంచి 2020 జనవరి వరకు పనిచేశారు. ఈసందర్భంగా సిబ్బంది, వసతిగృహ సంక్షేమ అధికారులు, ఇతర అధికారులు అభినందనలు తెలిపారు.

జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇన్‌చార్జి ఎస్ఈగా కృష్ణారెడ్డి

జిల్లా గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యశాఖ (ఆర్‌డబ్ల్యుఎస్) ఎఫ్ఏసీ ఇన్‌చార్జి ఎస్ఈగా సీహెచ్ ఎన్‌వి కృష్ణారెడ్డి బాధ్యతలు చేపట్టారు. అలాగే ఈఈ కూడా దీర్ఘకాలపు సెలవుకు వెళ్లడంతో ఈఈ బాధ్యతలూ అప్పగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. అమలాపురం ఈఈగానూ పనిచేస్తున్నారు.



జగన్నాథపురంలో వేటకు సిద్ధమైన బోట్లు

సముద్రంలో చేపల వేటకు వేళాయె..

- నేటి అర్ధరాత్రి బయల్దేరనున్న బోట్లు
- వేటకు మత్స్యకారుల సిద్ధం

6

నెక్స్ట్ ఏంటి?

- ఇంటర్ తర్వాత ఏం చేయాలి..
- ఇంజినీరింగ్‌లో ఏ కోర్సు తీసుకోవాలి?
- విద్యార్థులు, తల్లిదండ్రుల మధ్య చర్చ
- మంచి కాలేజీల కోసం వేట

6

బరిలోకి దిగితే.. పతకాల పంటే


కర్రసాము చేస్తున్న రాయుడు జోత్స్న, జోష్మితసత్యశ్రీ

- కర్రసాములో సత్తా చాటుతున్న అక్కాచెల్లెలు
- రాష్ట్రస్థాయిలో ఐదు స్వర్ణ పతకాలు
- ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచిన జోత్స్న
- కత్తిసాములోను ప్రతిభ కబరుస్తున్న వైనం

ఆ అక్కాచెల్లెళ్లు కర్రసాములో ఆరితేరారు. కర్ర పట్టారంటే పతకం కొట్టాల్సిందే.. కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తున్నారు.. రాష్ట్రస్థాయి పోటీల్లో ఐదు స్వర్ణపతకాలు సాధించి బౌరా అనిపిస్తున్నారు. వీరిలో అక్క కత్తిసాములోను ప్రతిభ కనబరుస్తూ ఆకట్టుకుంటోంది.

అమలాపురం టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అమలాపురంలో ప్రముఖ పంచాంగకర్త ఉపద్రష్టవారి ఇంట అక్కాచెల్లెలు జోత్స్న, జోష్మితసత్యశ్రీ కర్రసాములో శిక్షణ పొందారు. రాష్ట్రస్థాయి కర్రసాము పోటీల్లో అద్భుత ప్రతిభ చాటి ఐదు స్వర్ణ పతకాలు, ఒక రజత పతకం సాధించడంతోపాటు అక్క జోత్స్న ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచింది. అంబాజీపేట మండలం మాచవరం గ్రామానికి చెందిన రాయుడు రమేష్‌బాబు-సౌజన్య దంపతులకు ముగ్గురు కుమార్తెలు. ఆధునిక సమాజంలో ఆత్మరక్షణ విద్య ఆవశ్యకతను ఆ తల్లిదండ్రులు గుర్తించారు. ఇద్దరు కుమార్తెలకు మూడేళ్లగా కర్రసాము, కత్తిసాము విద్యల్లో శిక్షణ ఇప్పించారు. అమలాపురం పట్టణానికి చెందిన ఉపద్రష్ట నాగాదిత్యన్, విమలాదిత్యన్, విక్రమాదిత్యన్, విజయాదిత్యన్‌ల వద్ద 60మంది కర్రసాము శిక్షణ పొందుతుండగా వారిలో 15 మంది విద్యార్థినులు ఉన్నారు. వారితోపాటు శిక్షణ పొందిన రమేష్‌బాబు కుమార్తెలు జోత్స్న, జోష్మితసత్యశ్రీ ఇటీవల గుంటూరు జిల్లా పెదనందిపాడులో జరిగిన రాష్ట్రస్థాయి తొలి కర్రసాము టోర్నమెంట్-2025 పోటీల్లో అక్కాచెల్లెలు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి కర్రసాము పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించిన అక్కాచెల్లెలు జోత్స్న, జోష్మితసత్యశ్రీ

ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా..

రాష్ట్రస్థాయి కర్రసాము పోటీల్లో జోత్స్న నాలుగు స్వర్ణ పతకాలతోపాటు ఒక రజత పతకం సాధించింది. రాష్ట్రం నలుమూలలనుంచి వందలాది మంది ఈ పోటీల్లో పాల్గొన్నప్పటికీ అద్భుత ప్రతిభతో జోత్స్న ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచింది. ఇక సోదరి జోష్మితసత్యశ్రీ సబ్ జూనియర్ విభాగంలో స్వర్ణ పతకం సాధించింది. కర్రసాముతోపాటు కత్తిసాములోను అక్కాచెల్లెలు ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు. జోత్స్న ప్రస్తుతం 7వ తరగతిలోకి రాగా సత్యశ్రీ 5వతరగతి చదవుతుంది. మంగళవారం ఉపద్రష్టవారి ఇంట జరిగిన కార్యక్రమంలో అక్కాచెల్లెలు ఇద్దరినీ ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేలా శిక్షణ ఇస్తామని నాగాదిత్యన్ సోదరుడు ప్రకటించారు.

సముద్రంలో చేపల వేటకు వేళాయె...

కాకినాడ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రెండు నెలల విరామం తర్వాత సముద్రంలో చేపల వేటకు ఫిషింగ్ బోట్లు సిద్ధమవుతున్నాయి. మత్స్య సంపద వృద్ధి, పరిరక్షణ నిమిత్తం ఈ ఏడాది ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజుల పాటు సముద్ర జలాల్లో చేపల వేటపై నిషేధం విధించారు. ఇది శనివారం అర్ధరాత్రి ముగియనుంది. జీవో ఆర్టీ నెం.129 ప్రకారం సముద్ర జలాల్లో యాంత్రిక పడవలు, మర పడవలు (మెకనైజ్డ్, మోటరైజ్డ్ బోట్లు)తో ఏ రకమైన చేపల వేట సాగించకుండా కట్టుదిట్టం చేశారు. నిషేధ ఉత్తర్వులు ఉల్లంఘించి చేపల వేట సాగించే బోట్ల యజమానులు ఆంధ్రప్రదేశ్ సముద్ర మత్స్య క్రమబద్ధీకరణ చట్టం 1994 సెక్షన్ (4) ప్రకారం శిక్షార్హులు కాగలరని విస్తృతంగా ప్రచారం చేపట్టారు. వేట సాగించే బోట్లను, వాటిలోని మత్స్య సందపను స్వాధీనం చేసుకుని జరిమానా విధిస్తామని, బోట్ల లైసెన్సలను రద్దు చేయడంతో పాటు డీజిల్ ఆయిల్ సబ్సిడీ, ఇతర సబ్సిడీలు నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. నిషేధ కాలాన్ని కచ్చితంగా అమలు చేసేందుకు మత్స్య శాఖ కోస్ట్‌గార్డ్, కోస్టల్ సెక్యూరిటీ పోలీస్, రెవెన్యూ యంత్రాంగంతో గస్తీ పెట్టారు. కాకినాడ జిల్లాలో మెకనైజ్డ్ బోట్లు 395, మోటరైజ్డ్ బోట్లు 3,694 ఉన్నాయి. కాకినాడ, ఉప్పాడ, తాళ్లరేవు, తొండంగి తీర ప్రాంతం నుంచి మత్స్యకారులు బోట్లు ద్వారా సముద్ర జలాల్లో చేపల వేట సాగిస్తున్నారు. వీటిపై ఆధారపడి 25,419 మంది జీవనోపాధి పొందుతున్నారు. కూటమి ప్రభుత్వం జిల్లాలో వేట నిషేధ పరిహారంగా ఒక్కొక్కరికీ రూ.20 వేలు చొప్పున 25,419 మందికి రూ.50.83 కోట్లు అందజేసింది. నిషేధం గడువు ముగియడంతో బోట్లు, వలలకు మరమ్మతులు చేయించుకుని డీజిల్, నిత్యావసర సరుకులు సమకూర్చుకుని మత్స్యకారులు వేటకు సన్నద్ధమవుతున్నారు.

నేటి అర్ధరాత్రి బయల్దేరనున్న బోట్లు ... వేటకు సిద్ధమవుతున్న మత్స్యకారులు




వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.4.31లక్షలు

ఆత్రేయపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,31,934 లభించినట్టు ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి అమలాపురానికి చెందిన వరదా శరణ్‌కుమార్-సూర్యనాగవెంకట అమృత దంపతులు రూ.1,01,116 విరాళం సమర్పించారు. కరపకు చెందిన గొర్రెల్ల సాయి వెంకటవంశీ కుటుంబ సభ్యులు రూ.50,116 విరాళం సమర్పించారు. విజయవాడకు చెందిన పచ్చిపులుసు రామకృష్ణ-లీలాశ్రీ నిర్మలకుమారి దంపతులు రూ.51,116 విరాళాలను సమర్పించారు. దాతలకు స్వామివారి చిత్రపటాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.


అన్నదాన భవన నిర్మాణానికి విరాళం అందించిన దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

భీమేశ్వరాలయంలో ప్రముఖుల పూజలు


సైబరాబాద్ ఏసీపీ పద్మజకు వేదాశీర్వచనం ఇస్తున్న పండితులు

సామర్లకోట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రమైన కాకినాడ జిల్లా సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయానికి శుక్రవారం సైబరాబాద్ ఏసీపీ పద్మజ, విజయవాడ రైల్వే ఏసీబీ జడ్జి ఆర్.వెంకటేశ్వరరావు దంపతులు విచ్చేశారు. వారు భీమేశ్వర స్వామిని, బాలాత్రిపురసుందరి అమ్మవార్లను దర్శించి పూజలు చేశారు. ఆలయ ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో వేదాశీర్వచనం ఇచ్చి ప్రసాదాలు,స్వామి, అమ్మవార్ల చిత్రపటాలను అందజేశారు. నిత్యాన్న దాన పథకానికి సామర్లకోటకు చెందిన పస్తుల రత్నలీల-శ్రీసత్యసూర్యనారాయణ దంపతులు రూ.1,01,116 విరాళాన్ని చెక్కు రూపంలో ఈవో నీలకంఠానికి అందజేశారు. దాత దంపతులకు స్వామి, అమ్మవార్ల దర్శనం చేయించి వేదాశీర్వచనం ఇచ్చారు. చిత్రపటాలను ఈవో బహూకరించారు.


ఏసీబీ జడ్జి దంపతులకు వేదాశీర్వచనం పండితులు

ఈటీసీ ప్రిన్సిపాల్‌గా ప్రసాదరావు బాధ్యతల స్వీకారం


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ప్రసాదరావు

సామర్లకోట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్‌గా కరుటూరి నాగ వరప్రసాదరావు శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో ఎంపీడీవోగా పనిచేశారు. 25 ఏళ్ల క్రితం వీడీవోగా అప్పటి వీడీవో శిక్షణ కేంద్రంలో తొలిసారిగా శిక్షణ పొందారు. తిరిగి అదే కేంద్రం ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రసాదరావును అధికారులు, సిబ్బంది అభినందించారు. ఆయనకు డ్వామా ప్రత్తిపాడు ఏపీడీ మోకా భానుప్రకాష్ పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్ షాన్‌మోహన్‌ను కలిశారు.

సముద్ర తీరంలో జాతీయజెండాలతో యోగా


జాతీయజెండాలతో యోగా చేస్తున్న మన ఊరు మన బాధ్యత స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులు

పిఠాపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురానికి చెందిన మన ఊరు-మన బాధ్యత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శుక్రవారం వినూత్న రీతిలో యోగాంధ్ర నిర్వహించారు. సంస్థ సభ్యులు ఉప్పాడ సముద్ర తీరంలో జాతీయ జెండాలతో యోగాసనాలు వేశారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండేపూడి శంకరరావు, అల్లవరపు నగేష్, సభ్యులు కేవీఎస్ఎస్ ప్రసాద్, పెమ్మరాజు సత్యరామచంద్రరావు, రాయుడు శ్రీనుబాబు,నారాయణరెడ్డి పాల్గొన్నారు.

కనుమరుగు







మానవ తప్పిదాలతో కొన్ని, ప్రకృతి కన్నెర్రతో మరికొన్ని భారీ వృక్షాలు కనుమరుగవుతున్నాయి. వందల సంవత్సరాలకు పైగా వయసుండే వృక్షాలు రాజమహేంద్రవరం నగరంలోని సెంట్రల్ జైలు పరిసర ప్రాంతాల్లోనే ఉంటాయి. జైలు ఆధునీకరణ, ప్రైవేటు హోటల్ నిర్మాణ సమయంలోను చాలా వృక్షాలను తొలగించారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం సెంట్రల్ జైలు పార్కులో మరో వృక్షం నేలకూలింది. దాంతో సిబ్బంది ఆ వృక్షాన్ని ముక్కలుగా చేసి తరలించారు.

-ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం.



నెక్స్టు ఏంటి?

- ఇంటర్ తర్వాత ఏం చేయాలి?
- ఇంజినీరింగ్‌లో ఏ కోర్సు తీసుకోవాలి?
- విద్యార్థులు, తల్లిదండ్రుల మధ్య చర్చ

ఇంటర్ ఫలితాలొచ్చాయ్.. మంచి మార్కులతో పాసయ్యారు.. ఏపీఈఏపీసెట్ ర్యాంకులు కూడా వచ్చేశాయి. ఇంజినీరింగ్, డిగ్రీ.. వీటిలో నెక్స్ట్ ఏంటి? మీ గోల్ ఏంటి? ప్రస్తుతం చాలా ఇళ్లల్లో ఇదే చర్చ.. చాలామంది విద్యార్థులు, వారి తల్లిదండ్రుల మధ్య కూడా ఇదే టాపిక్ నడుస్తోంది.. ఏ కోర్సు చేస్తే బాగుంటుందనే విషయంపైనే చర్చ. డిగ్రీ చేసేద్దామనుకునే వారు కొందరైతే.. ఇంజనీరింగ్ చేయాలని మరికొందరు ఆలోచిస్తున్నారు. దీనిపై ప్రత్యేక కథనం..

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఏపీఈఏపీ సెట్ పరీక్షలు ముగిశాయి. త్వరలోనే ఫలితాలు వెలువడనున్నాయి. అనంతరం కౌన్సెలింగ్ కూడా జరగనుంది. ఇంజినీరింగ్ కాలేజీల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతుంటారు. ఏ బ్రాంచి తీసుకోవాలి? ఏ కళాశాలైతే బాగుంటుందనే సందేహాలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులను వేధిస్తుంటాయి. ఈ నేపథ్యంలో ఏకోర్సుకు ప్రాధాన్యమివ్వాలి? ఏ కోర్సు చేస్తే ఉద్యోగావకాశాలు లభిస్తాయి? నాలుగేళ్ల ఈ కోర్సును విజయవంతంగా పూర్తి చేయాలంటే ఏం చేయాలి? ఏ కోర్సుకు బాగా ఆదరణ ఉంది? అనే విషయాలపై ప్రస్తుతం చర్చ విద్యార్థులు, వారి కుటుంబసభ్యులు, స్నేహితుల మధ్య సాగుతోంది.

ఏం రంగం ఇష్టం..

ముందుగా విద్యార్థులు తమకు ఇష్టమైన రంగం ఏంటో తెలుసుకోవాలి. కంప్యూటర్ సైన్స్, మెకానికల్, ఈఈఈ, సివిల్, ఈఐ, ఐటీ వంటి కోర్సుల్లో ఏదైతే మనకు సరిపోతుంది?, ఎందులో అయితే మనం రాణించగలం అనే విషయమై స్పష్టత రావాలి. మన సామర్థ్యం ఏమిటో ఆలోచించుకుని దానికి తగ్గట్టుగా బ్రాంచిని ఎంపిక చేసుకోవాలి. లేకుంటే కోర్సు పూర్తి చేయలేక విద్యాసంవత్సరం వృథా అవుతుంది.

కళాశాల గురించి తెలుసుకోండి..

విద్యార్థులు తాము చేరబోయే కళాశాల గురించి పూర్తి సమాచారం తెలుసుకోవాలి. కళాశాలలో మౌలిక సదుపాయాలు, న్యాక్, అటానమస్, ఎన్‌బీఏ తదితర గుర్తింపులు ఉన్నాయో లేదో! చూసుకోవాలి. అక్కడ చదువుతున్న సీనియర్ విద్యార్థుల ఫీడ్ బ్యాక్ తీసుకోవాలి. కళాశాలలో విద్యాబోధన ఎలా ఉంటుంది? ఎక్స్‌పర్ట్ ఫ్యాకల్టీ ఉంటున్నారా? క్యాంపస్ ఇంటర్వ్యూలకు అవసరమైన నైపుణ్య శిక్షణ ఏమైనా ఇస్తున్నారా? వంటి వివరాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలి. కళాశాల వాతావరణం, క్రమశిక్షణ, నైతిక విలువలకు ప్రాధాన్యమిచ్చే కళాశాలలను పరిశీలించుకోవాలి.

కోర్ బ్రాంచీలపై దృష్టి పెట్టండి

ప్రస్తుతం విద్యార్థుల చూపంతా సీఎస్ఈ, ఐటీ, ఈసీలపైనే ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ప్రభావం, ఐటీ రంగంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు లేకపోవడంతో నూతన జాతీయ విద్యా విధానంలో వచ్చిన మార్పులతో కోర్ బ్రాంచీలపైనా దృష్టిసారించాలని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం కోర్ బ్రాంచీలైన మెకానికల్, ఈఈఈ సివిల్ విద్యార్థులు ఈ సబ్జెక్టును చదువుకోవచ్చు.

ఈఈఈ విద్యార్థులకు అవకాశాలు

ఇంజినీరింగ్‌లో ప్రధానంగా ఈఈఈ, మెకానికల్, సివిల్ బ్రాంచ్‌ల విద్యార్థులను కూడా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఆయా సంస్థలు ఎంపిక చేసుకుంటున్నాయి. వీరు ఇటు సాఫ్ట్‌వేర్ రంగంతోపాటు తమ కోర్ సంస్థల్లో కూడా ఎంపిక కావచ్చు. ఈ బ్రాంచ్ విద్యార్థులకు కాగ్నిజెంట్, టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, క్యాప్‌జెమినీ, హుందయ్ మోటార్స్, అశోక్ లేలాండ్, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్, కేసీపీ లిమిటెడ్, రామ్‌గ్రూప్, వీఈఈ టెక్నాలజీస్, జాస్పర్ ఇండస్ట్రీస్ వంటి ప్రముఖ సంస్థలు ఉద్యోగాలు ఆఫర్ చేస్తున్నాయి. గ్రీన్ ఎనర్జీ, సోలార్ ఎనర్జీ ప్రాముఖ్యం ఉన్న నేపథ్యంలో ఈఈఈ విద్యార్థులకు అవకాశాలు అధికం. బీటెక్‌లో ఏం బ్రాంచ్ చదివినా ఎంటెక్‌లో కంప్యూటర్స్ సంబంధిత కోర్సు చేయొచ్చు.



ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న

బీఎస్ఎఫ్ ఆర్ఎస్ఐ దేవానందంకు సత్కారం


దేవానందంను సత్కరిస్తున్న కమాండెంట్ నాగేంద్రరావు

కాకినాడ రూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో బీఎస్ఎఫ్ ఆర్ఎస్ఐ ఆర్.దేవానందం పాల్గొన్నారు. శుక్రవారం ఆయన్ను కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ ఎం.నాగేంద్రరావు సత్కరించారు. దేవానందం మాట్లాడుతూ బీఎస్ఎఫ్ 40 సంత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్నానని, ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్నందుకు చాలా సంతోషపడుతున్నానని అన్నారు. అదనపు కమాండెంట్ ఎస్.దేవానందరావు, అసిస్టెంట్ కమాండెంట్లు మోహన్‌రావు, చంద్రశేఖర్‌రావు, ఆర్ఐ రాము, యూనిట్ వైద్యాధికారి శ్రీరామ్ పాల్గొన్నారు.



ఎండల్లో.. హాయ్ హాయ్



అమలాపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి యానాం నుంచి ద్రాక్షారామ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై దారి పొడవునా రోడ్డుకు ఇరువైపులా గతంలో నాటిన మొక్కలు చెట్లయ్యాయి. మండు వేసవిలో సైతం ఆ రహదారిపై పయనం ఎండల్లో హాయ్ హాయ్ అన్నట్టుగానే ఉంటుంది.

725.. నో సర్టిఫై!



- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 3970 స్కూల్ బస్సులు
- ఇంకా పూర్తికాని 725 బస్సుల ఫిట్‌నెస్
- విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం
- ఫిట్‌లో రవాణా శాఖ పాత్ర సున్నా
- 'అన్నీ' ప్రైవేటు సంస్థే.. తీవ్ర ఆరోపణలు
- తెరుచుకున్న పాఠశాలలు
- ఆందోళనలో తల్లిదండ్రులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

మీ పిల్లలు బడి బస్సులో వెళ్లి వస్తున్నారా? ఆ వాహనానికి ఫిట్‌నెస్ (ప్రయాణించే సామర్థ్యం) ఉందో లేదో చూసుకోండి మరి. ఎందుకంటే పాఠశాలలు తెరిచేసినా ఇంకా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొం దని బస్సులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వందల్లో ఉన్నాయి. 2025-26 నూతన విద్యా సం వత్సరం ఈ నెల 12 నుంచి ప్రారంభమైంది. అ యితే ఇంకా ఉమ్మడి జిల్లాలో బడి బస్సుల సామ ర్థ్య పరీక్షలు అన్నిటికీ పూర్తి కాలేదు. ఫిట్‌నెస్ పూర్తయిన వాటిపైనా పలు అనుమానాలు వ్యక్త మవుతున్నాయి. ప్రైవేటు పాఠశాలల్లో వేలాది మంది విద్యార్థులు బస్సుల్లోనే వెళ్లి వస్తుంటారు. విద్యార్థులను ఎక్కించుకునే బస్సులకు తప్పనిసరిగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఉండాలి. ప్రతి ఏడాదీ ఈ సర్టిఫికెట్లు తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పుడు రెండేళ్లకు పొడిగించారు. మార్చి వరకూ రోడ్డు రవాణా అధికారులు నిబంధనల ప్రకారం తనిఖీ చేసి ఆ ధ్రువపత్రాన్ని జారీ చేయడం జరిగేది. కానీ ఆ తంతును ప్రైవేటుకు అప్పగించడంతో ఫిట్‌నెస్‌పై ఆందోళన వ్యక్తమవుతోంది. కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లో ఆటోమేటెడ్ టెస్టింగ్ సిస్టం ద్వారా ప్రైవేటు సంస్థ ఫిట్‌నెస్ ధ్రువీకరణ చేస్తోంది. కోనసీమ జిల్లాలో ఏటీఎస్ నిర్మాణంలో ఉండడంతో రవాణా అధికారులు వాహన సామర్థ్య పరీక్షలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఇంకా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందని బస్సులు వందల్లో ఉండడం ఆందోళన కలిగిస్తోంది.

● సర్టిఫికెట్ జారీ ఇలా..

రవాణా శాఖ ఆవిర్భావం నుంచి స్కూల్ బస్సులకు ఆ శాఖే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తోంది. వాహనాన్ని రవాణా అధికారులు భౌతికంగా నిబంధనల ప్రకారం తనిఖీ చేసి ఒక వేళ ఏవైనా మరమ్మతులు ఉంటే చేయించుకున్న తర్వాత ధ్రువపత్రం జారీ చేసేవారు. చాలామంది అలసత్వం వహిస్తుండడంతో రవాణా శాఖ ఓ వెబ్‌సైటు రూపొందించింది. వెబ్‌సైటులో నేరుగా పాఠశాల యజమానులు బస్సుల వివరాలు, డ్రైవర్ల వివరాలను అప్‌లోడ్ చేసుకునేలా వెసులుబాటు కల్పించారు. వెబ్‌సైటులో స్కూల్ వివరాలను పూర్తిగా నమోదు చేయాలి. తర్వాత వచ్చే ధ్రువపత్రాన్ని ప్రింట్ తీసుకుని స్థానిక రవాణా అధికారి వద్దకు వాహనంతో వెళ్తే నిబంధనల ప్రకారం తనిఖీలు నిర్వహించి బ్రేక్ నిమిత్తం చలానా కట్టిస్తారు.

● వైసీపీ నిర్వాకం

కానీ వైసీపీ ప్రభుత్వం ఈ విషయంలో కూడా నిర్వాకాన్ని వెలగబెట్టింది. శి క్షణ పొందిన అధికారులను కాదని ఫిట్‌నెస్ జారీని పూర్తిగా ప్రైవేటు సంస్థలకు అప్పగించింది. దానినే ప్రస్తుత ప్రభుత్వం కూడా కొనసాగిస్తోంది. వాస్తవానికి కేంద్రప్రభుత్వం ఈ విధానానికి సంబంధించిన నిర్దేశాలను అన్ని రాష్ట్రాలకూ జారీ చేసింది. అయితే చుట్టుపక్కల రాష్ట్రాల్లో ఈ విధానం అమల్లో ఉన్నా నియంత్రణ మాత్రం రవాణా శాఖ చేతుల్లోనే ఉంచారు. మన దగ్గర మాత్రం పూర్తిగా ప్రైవేటుకే ధారాదత్తంచేయడంతో 'రేటు' పెట్టి మరీ పనులు కానిచ్చేస్తున్నారని చెబుతున్నారు. స్కూల్ బస్సుల సామర్థ్య ధ్రువీకరణలో కూడా రూ.4వేల నుంచి రూ.12వేల వరకూ అదనంగా వసూలు చేస్తూ బస్సు ఏటీఎస్‌కి వెళ్లక పోయినా, నెంబరు ప్లేట్లు మార్చి తీసుకొస్తున్నా పని కానిచ్చేస్తున్నారనే ఆరోపణలతో విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ పైసొమ్ము ఇవ్వకపోతే ఏదో సాకు చూపించి వేధిస్తున్నారని అంటున్నారు. ఇటీవల ఓ ఆటోవాలా ఫిట్‌నెస్‌కి వెళ్లగా పైసొమ్ము ఇవ్వలేదనే సాకుతో వేధించడంతో ఆవేదనతో తన ఆటో అద్దం తనే బద్దలు కొట్టుకొని నిరసన తెలిపాడు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి సర్దుబాటు చేయాల్సి వచ్చింది. అలాగే ఎఫ్‌సీ ఒక వాహనం పేరున ఉండి.. మరో వాహనం నెంబరుతో ఎఫ్‌సీ ఉండడం వంటి కూడా ఉంటున్నా యని చెబుతు న్నారు. కొన్ని రాష్ట్రాలు ప్రైవేటు సంస్థ ఫిట్‌నెస్ చూసే ప్రదేశంలో రవాణా శాఖ నుంచి అనుభవం కలిగిన అధికారులను నియమించి జాగ్రత్తగా అమలు చేస్తున్నాయి. మన దగ్గర మాత్రం పూర్తిగా ప్రైవేటుకే దాసోహం అయిపోయారు. ఆర్టీవోకి కూడా లాగిన్ అధికారం లేకుండా పోయి ంది. విద్యార్థుల విషయంలో ఈ తంతు ప్రమా దానికి కోరలు ఇచ్చినట్లుగా ఉందనే వాదన వినవస్తోంది.

● అటువైపు చూడొద్దు

సదరు ప్రైవేటు సంస్థ వైపు కన్నెత్తి చూడొద్దని రవాణా అధికారులకు ఆదేశాలు ఉండడంతో అచేతనంగా ఉండాల్సి వస్తోంది. అసలు నిబంధనలు పాటిస్తున్నారా? అనే విషయంలో కూడా స్పష్టత ఉండడం లేదు. ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ ద్వా రా తనిఖీలు చేస్తున్నారని చెబుతున్నారు. అయితే ఆ యంత్రాల పనితీరుపై తనిఖీలు లేవు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే అధికారులు చూస్తున్నారని అంటున్నా.. దానిలో నిజంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చట్టప్రకారం సుమారు 50 రకాల నిబంధనలను ఫిట్‌నెస్ కోసం తనిఖీ చేయాల్సి ఉంటుంది. వాటిలో కొన్నిటిని భౌతికంగా పూర్తి చేయాలి. కానీ తూతూమంత్రంగా కానిచ్చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పైగా గతంలో కొవ్వూరు, రాజమండ్రిలో తనిఖీలు నిర్వహించే వారు. ప్రైవేటు కంపెనీ మాత్రం ఒకే చోట ప్రక్రియ పూర్తిచేస్తోంది. దీంతో వాహనదా రులు ఇబ్బంది పడుతున్నారు.

తల్లిదండ్రుల బాధ్యత ఏంటి?

పిల్లలను ఉదయం స్కూల్ బస్సు ఎక్కించడం, సాయంత్రం దించి ఇంటికి తీసుకెళ్లడం ఒకటే తల్లిదండ్రుల బాధ్యత అనుకుంటే పొరబాటే. పిల్లలు ప్రయాణించే బస్సు, డ్రైవరు, కండక్టరు పరిస్థితులు గమనిస్తూ ఉండాలి. బస్సు కండీషన్‌ని పరిశీలిస్తుండాలి. యాజమాన్యం నిబంధనలు పాటించకపోతే రవాణా, పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. డ్రైవర్, అటెండర్ తీరును గమని స్తుండాలి. వాహనం నడిపే సమయంలో, పిల్లలను ఎక్కించేటప్పుడు, దించేటప్పుడు బాధ్యతగా ఉన్నాడా? సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తున్నారా? బస్సు లో పొగతాగడం, మద్యం తాగి డ్రైవింగ్ చేయడం వంటివి చేస్తున్నారా? ముఖ్యంగా విద్యార్థినులతో వారి ప్రవర్తన ఎలా ఉంది? అనేవి రోజూ గమ నిస్తుండాలి. బస్సు సిబ్బంది ప్రవర్తన ఇబ్బందిగా ఉన్నాసరే తల్లిదండ్రులకు భయపడి కొందరు పిల్లలు విషయాలను దాస్తుంటారు. అందువల్ల పిల్లలను ఆరా తీస్తూ ఉండాలి. చాలామంది డ బ్బులు తగ్గుతాయని, బస్సు సదుపాయం లేక పోవడం వంటి కారణాలతో ఆటోల్లో కుక్కినట్లు పంపిస్తుంటారు. దీని వల్ల పిల్లలు స్కూల్‌కి చేరుకునే సమయానికి అలసిపోతారు. పైగా ప్రమాదం కూడా.

ఈ బస్సుల సంగతేంటి..!

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో చూస్తే తూర్పు గోదావరిలో 1572 స్కూల్ బస్సులు ఉండగా 1300, కాకినాడ జిల్లాలో 1200కు 1050, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1203కు 900 బస్సులకు ఫిట్‌నెస్ పూర్తయింది. ఇంకా 725 బస్సులకు ఫిట్‌నెస్ పూర్తి కాలేదు. ఇవి రోడ్లపై తిరిగితే ప్రమాదాన్ని ఆహ్వానించినట్టే.

బస్సు ఇలా ఉండాలి..

స్కూల్ బస్సులో పవర్ స్టీరింగ్‌తోపాటు ఫ్రీప్లే చాలా తక్కువగా ఉండాలి. డ్యాష్‌బోర్డు ప్యానెల్‌లో ఎడమ, కుడి సాంకేతాల ఇండికేటర్, ఎయిర్ ప్రెజర్ గేజ్, ఫెయిల్స్ సేఫ్టీ ఇండికేటర్, బ్రేకులలో లోపాలను తెలిపే ఇండికేటర్, ఫ్యూయల్ మీటర్, స్పీడో మీటర్ ఉండాలి. డ్రైవర్ సీటు వద్ద ఎయిర్ హ్యాండ్ బ్రేక్, హ్యాండ్ లివర్ గైడ్ స్ప్రింగ్, గేర్ లివర్‌లో అంతర్గత స్ప్రింగ్ ఉండాలి. క్లచ్ ప్లేట్, పెడల్ ఫ్రీప్లే ఒక అంగుళానికి తక్కువ ఉండకూడదు. వెనుక ఉన్న వాళ్లు కనిపించే అద్దం, బస్సులో కూర్చున్న విద్యార్థుల కదలికలు తెలుసుకోడానికి డ్రైవరు వద్ద అద్దం ఉండాలి. ఫుట్‌బోర్డు మొదటి మెట్టు భూమి నుంచి 325 మిల్లీమీటర్లకు మించి ఉండరాదు. ఫుట్‌బోర్డు మొట్ల వద్ద విద్యార్థులు ఎక్క డానికి, దిగడానికి వీలుగా రెయిలింగ్, సరిపడా లైటింగ్ ఉండాలి. సీట్ల కింద లగేజీ బాక్సులు, పార్కింట్ లైట్లు, అత్యవసర ద్వారం, సురక్షితమైన విండ్ షీల్ (అద్దం), అత్యవసర సమయంలో డోర్ అద్దాలు పగుల గొట్టడానికి సుత్తి, అగ్నిమాపక యంత్రం (పొడి), బస్సు తలుపులకు సురక్షిత లాకింగ్ సిస్టం, కాన్వెక్స్ క్రాస్ వ్యూ అద్దాలు ఉండాలి. సైడ్ విండోలకు మధ్యలో 31 అంగుళాలకు మించని దూరంలో అడ్డంగా 3 లోహపు కడ్డీలు అమర్చాలి. సీటింగ్ కెపాసిటీకి మించి అంటే విద్యార్థులు నిలబడి ప్రయాణించే విధంగా ఎక్కి ంచుకోవడం నిషేధం. బస్సుకు పసుపు రంగు వేయాలి. డ్రైవర్‌కి కనీసం ఐదేళ్ల అనుభవం ఉండాలి. అత్యవసర ద్వారాలు, సీటు ఆర్‌సీ బుక్ ప్రకారం ఉండాలి. సైడ్‌రాడ్‌లు కనీసం 2, 3 ఉండా లి. ఫస్ట్ ఎయిడ్ బాక్సులో అత్యవసర మందులు అందుబాటులో ఉండాలి. ఫైర్ సిలిండర్ వినియోగానికి సిద్ధంగా ఉండాలి. అటెండర్ వాటిని రోజూ పరిశీలించాలి. డ్రైవర్, ఎంవీఐ సెల్ నెంబర్లు కనిపించేలా ఉండాలి. విద్యార్థుల జాబితా బస్సులో ఉండాలి. లైటింగ్ సిస్టం మొత్తం బాగుండాలి.



ప్లాస్టిక్ కవర్లో పసికందు

అల్లూరి జిల్లా కొక్కిరిగూడెం అటవీ ప్రాంతంలో సంఘటన



ఆసుపత్రిలో పసికందు, వైద్యం చేస్తున్న సిబ్బంది



చింతూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఓ తల్లి పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఆ మరుక్షణమే పసికందుని ప్లాస్టిక్ కవర్లో ఉంచి ఆ కవర్‌ని చెట్టుకు వేలాడదీసి మాయమైంది. అల్లూరి సీతారామరాజు జిల్లా వరరామచంద్రపురం మండలం కొక్కిరిగూడెం అటవీ ప్రాంతంలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం కొక్కిరిగూడెనికి చెందిన కొందరు అటవీ ప్రాంతానికి వేటకెళ్లారు. వారిలో మడివి రత్నరాజుకు ఓ చెట్టు వద్ద నుంచి పసికందు రోదన వినిపించింది. దీంతో చెట్టుకు వేలాడుతున్న ప్లాస్టిక్ కవర్‌తోపాటు అందులో ఉన్న పసికందుని చూసి నివ్వెరపోయాడు. వెంటనే ఇంటికెళ్లి తల్లి ముత్తమ్మకు విషయాన్ని చెప్పాడు. దీంతో ముత్తమ్మ చెట్టు వద్దకు వెళ్లి పసికందుని తీసుకుని ఇంటికెళ్లింది. విషయం తెలుసుకున్న కుందులూరు సబ్‌సెంటర్ ఏఎన్ఎం గుంపెనపల్లి చంద్రమ్మ బృందం హుటాహుటిన పసికందుని చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి నేతృత్వంలో చిన్నపిల్లల వైద్య నిపుణుడు మహేష్ ఆ పసికందుకు వైద్యం అందిస్తున్నారు. బిడ్డ పుట్టి దాదాపు 7,8 గంటలపాటు ఏడవడం, బొడ్డు కూడా కత్తిరించకపోవడంతో పరిస్థితి విషమంగా ఉందని, అయినప్పటికీ వైద్యం అందిస్తామని, పోలీ సులకు సమాచారమిచ్చామని కోటిరెడ్డి తెలిపారు.

సముద్రంలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



మరణించిన పార్థు (ఫైల్)

కాకినాడ రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ స్టోన్ బీచ్ వద్ద సముద్ర స్నానానికి దిగి గల్లంతైన యువకుడి దేహం లభ్యమైంది. వివరాల ప్రకారం.. గురువారం ఉదయం తూర్పు గోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన దుర్గాప్రసాద్, జంగారెడ్డిగూడెం మండలం ఏపోలవరానికి చెందిన కేతా మోహన్, జీలుగుమిల్లి మండలం లక్ష్మీపురానికి చెందిన సముద్రాల పార్థు(17) కలిసి కాకినాడ బీచ్ సందర్శనకు పల్సర్ ద్విచక్ర వాహనంపై స్టోన్‌బీచ్‌కు చేరుకున్నారు. మోహన్ ఫొటోలు తీస్తుండగా దుర్గాప్రసాద్, పార్థు స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. పార్థు అనుకోకుండా అలలధాటికి కొట్టుకుపోయి సముద్రంలో గల్లంతుకాగా ఎంత ప్రయత్నించినా రక్షించలేకపోయారు. పోలీసుల గాలింపు చర్యల్లో భాగంగా శుక్రవారం ఉదయం యువకుడి దేహం లభ్యమైనట్టు తిమ్మాపురం ఎస్ఐ గణేష్‌కుమార్ తెలిపారు. నారపురెడ్డి దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

బీచ్ ఒడ్డున గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కాకినాడ రూరల్ పోలవరంలో గల జగన్మోహనపురం ఆర్చ్ ఎదురుగాగల బీచ్ ఒడ్డున గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్టు తిమ్మాపురం ఎస్ఐ గణేష్ కుమార్ తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 30 నుంచి 40 ఏళ్ల ఉంటుందని, ఎరుపురంగు కట్ బనియన్, నలుపురంగు డ్రాయర్ ఉన్నాయని, దానిపై అరుణ్‌గోల్డ్ ధూమ్ అనే అక్షరాలు ఉన్నాయని పేర్కొన్నారు. వివరాలు తెలిస్తే 9440796556 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

సత్యదేవుడి సన్నిధిలో గెయిల్ అధికారుల పూజలు



సత్యదేవుడి దర్శనానంతరం గెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ తదితరులు

అన్నవరం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో శుక్రవారం గెయిల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్‌కుమార్ గుప్తా, ఈడీ శాలిగ్రామ్ మావర్, జీఎం వై.ఏ కుమార్, షాకున్ గుప్తా తదితరులు స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానానికి వ్యర్థపునీటిని శుద్ధిచేసే సీపీపీ యంత్రం కావాలని కోరగా దానికి సంబంధించి లేఖను పంపిస్తే పరిశీలిస్తానని హామీఇచ్చారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు,ఈఈ రామకృష్ణ ఉన్నారు.

ఘనంగా చండీహోమం

రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ, సప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11 గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ముక్తేశ్వరాలయంలో చోరీ

అయినవిల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం ముక్తేశ్వరం శ్రీముక్తికాంత క్షణముక్తేశ్వరాలయంలో చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం మధ్యాహ్నం ఆలయం మూసివేసిన సమయంలో ఆలయానికి వేసిన తాళాలు బద్దలుకొట్టి దొంగలు చోరీ చేశారు. పోలీసులకు ఫిర్యాదు అందడంతో క్లూస్‌టీమ్ కె.ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో వేలిముద్రలు సేకరించారు. రూ. 1.40లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు అపహరించుకుపోయినట్టు తెలిపారు.



ఆలయంలో క్లూస్‌టీమ్ పరిశీలన

మహిళ ఆత్మహత్యాయత్నం

రక్షించిన సీఐ



మహిళను రక్షించిన పోలీసులు

ఆలమూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ గౌతమి బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకోబోయిన మహిళను రావులపాలెం సీఐ సీహెచ్.విద్యాసాగర్ రక్షించారు. బిక్కవోలు మండలానికి చెందిన పలివెల శైలజ (30) తన భర్త రాజుతో ఉన్న కలహాల కారణంగా శుక్రవారం జొన్నాడ వద్దకు చేరుకుని గౌతమి బ్రిడ్జిపై నుంచి దూకే ప్రయత్నం చేస్తుండగా అటుగా వెళ్తున్న రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్ అడ్డుకున్నారు. ఆమెను ఆలమూరు పోలీసుస్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇప్పించి బంధువులకు అప్పగించారు.

2110 కిలోల బియ్యం స్వాధీనం



పోలీసులు సీజ్ చేసిన వ్యాన్

ఆలమూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ వద్ద వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని ఆలమూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వ్యాన్‌లో పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వచ్చి న సమాచారంతో తనిఖీలు నిర్వహించి వ్యాన్‌ను గుర్తిం చారు. దీనిలో 42 బస్తాల (2110కిలోల) బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ అశోక్ తెలిపారు. వీటి విలువ రూ.97వేలుగా గుర్తించినట్టు చెప్పారు. ఆలమూరు ఎంఎస్‌వో ఎస్ జి. పద్మ ఫిర్యాదు మేరకు వ్యాన్‌ను సీజ్ చేసి కర్రి రామారెడ్డి, విజ్జన సుదర్శన్‌రావు, కాకిలేటి ప్రవీణ్‌కుమార్, నిశ్శనకోళ్ల జీవన్‌కుమార్‌లపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

గడ్డిమందు తాగిన యువకుడి మృతి

కాకినాడ రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గడ్డిమందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం పండూరులో బుధవారం సాయంత్రం 7గంటల ప్రాంతంలో కోటికుల రాజేష్ (29) ఆర్థిక ఇబ్బందులతో ఒత్తిడిని తట్టుకోలేక గడ్డిమందును తాగాడు. రాజేష్ గతంలో తన సోదరుడితో కలిసి కౌలుకు వ్యవసాయం చేసేవాడు. భారీ అప్పుల కారణంగా తమ ఇంటిని తాకట్టు పెట్టడంతో 4 నెలల క్రితం బ్యాంకు అధికారులు ఇంటిని స్వాధీనంచేసుకోవడంతో రాజేష్ మానసికంగా కుంగిపోయి గడ్డి మందు తాగాడు. కాకినాడ జీజీహెచ్‌లో చేర్పగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందినట్టు తిమ్మాపురం ఎస్ఐ గణేష్‌కుమార్ తెలిపారు. తండ్రి అప్పలకొండ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

తొండంగి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం బుచ్చియ్యపేటకు చెందిన మడికి నాగ గోపి (39) మద్యానికి బానిసై బుధవారం గడ్డిమందు తాగాడు. అతడిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా శుక్రవారం మృతిచెందినట్టు తొండంగి ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు.

దైవ దర్శనానికి వెళ్తుండగా..

ఆటోను లారీ ఢీకొని ఒకరి మృతి

- ఇద్దరికి తీవ్రగాయాలు
- కృష్ణంపాలెం హైవేపై ఘటన



మరణించిన దుర్గ (ఫైల్)

దేవరపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): దైవ దర్శనానికి ఆటోలో వెళ్తున్నవారికి వెనుక నుంచి లారీ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం కృష్ణంపాలెం జాతీయ రహదారి వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరం సీతంపేటకు చెందిన చుక్కా బంగారయ్య, రమణమ్మ కుటుంబం విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి 11 మంది ఆటోలో బయలుదేరారు. ఈ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె అంజలీ దుర్గ (17) డిగ్రీ చదువుతోంది. రాజమహేంద్రవరం సీతంపేట నుంచి వారు బయలుదేరగా కృష్ణంపాలెం జాతీయ రహదారిపై ఆటోను వెనుక నుంచి లారీ ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అంజలీ దుర్గను కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. ఇదే ఘటనలో ఆటో డ్రైవర్ ఎన్.నరేష్, నెల్లి వీరబాబుకు తీవ్రగాయాలయ్యాయి. 108 వాహనంలో గోపాలపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, అక్కడి నుంచి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.



108లో క్షతగాత్రులు తరలిస్తున్న దృశ్యం

తండ్రి మందలించాడని కొడుకు ఆత్మహత్య



మరణించిన సతీష్ (ఫైల్)

కొత్తపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తండ్రి మందలించాడని మనస్తాపానికి గురైన కొడుకు ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతిచెందినట్టు ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం పలివెల గ్రామానికి చెందిన తులా రాంబాబు కుమారుడు సతీష్(31) పనులకు వెళ్లి డబ్బులు ఇంట్లోకి తేకుండా మద్యానికి బానిసయ్యాడని మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన సతీష్ స్నానం చేసేందుకు అని చెప్పి వాటర్ బకెట్, హీటర్ తీసుకుని వెళ్లి ఎంతసేపటికి బయటకు రాలేదు. రాంబాబు కంగారుపడి కిటికిలోంచి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. దీంతో చుట్టుపక్కల వారి సాయంతో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే చనిపోయిన్నట్టు వైద్యులు ధృవీకరించారు. దీంతో తండ్రి రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సురేంద్ర తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ మృతి



మృతిచెందిన పోసిబాబు



ఫైల్ ఫొటో

ఆత్రేయపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పనులు చేస్తుండగా విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ మృతి చెందాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వేలిచేరుకు చెందిన తోట పోసిబాబు(32) శుక్రవారం సాయంత్రం వెలి చేరుపులిదిండి సమీపంలో వ్యవసాయ పనులు చేస్తుండగా వ్యవసాయ మోటారు జీవైర్ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు గురికావడంతో పోసిబాబు అక్కడికక్కడే మృతిచెందాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోసిబాబు మృతి వార్త తెలిసిన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాము పేర్కొన్నారు.

కారు ఢీకొని తల్లీకొడుకులకు గాయాలు

అమలాపురం రూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పేరూరు వై.జంక్షన్ వద్ద శుక్రవారం ఉదయం మోటారుసైకిల్‌పై ఇంటికి వస్తున్న తల్లీకొడుకులను వెనుక నుంచి కారు వేగంగా వచ్చి ఢీకొని వెళ్లిపోయింది. గాయపడ్డ వారిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. పట్టణ సీఐ పి.వీరబాబు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. వన్నెచింతలపూడి గ్రామానికి చెందిన కందేరి మరియమ్మ, రాజులు అల్లవరం మండలం గూడాలలో బంధువుల ఇంటికి వెళ్లారు. ఉదయం ఇంటికి తిరిగి వస్తుండగా పేరూరు వై.జంక్షన్ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి కారు వేగంగా ఢీకొని వెళ్లిపోయింది. గాయపడ్డ తల్లీకొడుకులను ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సీసీ కెమెరాలను పరిశీలించి అల్లవరం మండలం కోడూరుపాడుకు చెందిన వ్యక్తి కారుగా గుర్తించి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు.

మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం..

చికిత్స పొందుతూ యువతి మృతి

భీమవరం క్రైం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మనస్తాపానికి గురైన యువతి ఆత్మహత్యం చేయగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు భీమవరం వన్‌టౌన్ హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు తెలిపారు. వివరాలివి.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం చిర్రమానం గ్రామానికి చెందిన సంగాని రామలక్ష్మి తన ముగ్గురు పిల్లలతో భీమవరం తన తమ్ముడి ఇంటికి వచ్చింది. గతనెల 28న మొబైల్ ఫోన్ విషయంలో వాగ్వాదం జరగడంతో పెద్ద కుమార్తె అయిన సంగాని చందన ప్రియ(20)ను ఆమె తల్లి మందలించింది. మరుసటి రోజు 29న తెల్లవారుజామున రామలక్ష్మి తమ్ముడు ఇంటి బయట చూడగా ఆ యువతి షెడ్డులో ఇనుపరాడ్డుకు చీరతో ఉరివేసుకుని ఉండడం గమనించారు. వెంటనే కిందకు దించి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 12వ తేదీ సాయంత్రం యువతి మృతిచెందింది. దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ తెలిపారు.

రెండో రోజుకు ఎరెవ్నా 4.0 సదస్సు

జీజీహెచ్(కాకినాడ) జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎరెవ్నా 4.0 సదస్సు రెండోరోజు శుక్రవారం కూడా కొనసాగింది. ప్రధానంగా జీజీహెచ్‌లో 15 వర్క్‌షాపులు నిర్వహించారు. హ్యాండ్స్ ఆన్ సర్జరీ, బేసిక్ ట్రామా కేర్, ఆడిట్ టూ యాక్షన్, విజియో నెక్స్, డయోగ్నోస్టిక్ స్కిల్స్, బర్తింగ్ బ్రిలియన్స్, రేడియేషన్ ఆంకాలజీ తదితర అంశాలపై వర్క్‌షాపులు, పేపర్ ప్రెజెంటేషన్‌లు నిర్వహించారు. అనంతరం సాయంత్రం మెడికల్ డిబేట్ నిర్వహించారు. ఉదయం సెషన్‌లో ట్రజర్ హంట్ కార్యక్రమం ద్వారా వైద్య విజ్ఞానాన్ని పెంపొందించే యాక్టివిటీలు నిర్వహించారు. అలాగే సాయంత్రం రంగరాయ వైద్య కళాశాల ప్రాంగణంలో ఎరెవ్నా సదస్సుకు వివిధ వైద్య కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు సాంస్కృతిక ప్రదర్శనలు, పోటీలు నిర్వహించారు. శుక్రవారం మరో 50 మంది విద్యార్థులు రిజిష్టర్ అయ్యారు.

విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు



కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

పిఠాపురంలో వాహనాల తనిఖీ

పిఠాపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పోలీసులు శుక్రవారం సాయంత్రం వాహనాల తనిఖీ నిర్వహించారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. డ్రైవింగ్ లైసెన్సులు, ఇతర పత్రాలు లేని వారికి జరిమానాలు విధించారు. చర్చి సెంటర్, కూరగాయల మార్కెట్, కోటగుమ్మం మీదుగా ఉప్పాడ సెంటరు వరకు ఫుట్‌మార్చ్ జరిపి దుకాణాల ముందున్న ఆక్రమణలను తొలగించారు. పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, పట్టణ పోలీసులు పాల్గొన్నారు.



కోనపాపపేటలో శ్రామికులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధి హామీ ఏపీవో కొండలరావు

‘శ్రామికుల జీవనోపాధి మెరుగుకు చర్యలు’

కొత్తపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో వంద రోజుల పని దినాలు చేసిన శ్రామికులకు జీవనోపాధి మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఏపీవో కొండలరావు చెప్పారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సూచన మేరకు సామాజిక తనిఖీ డైరెక్టర్ జి.శ్రీకాంత్ పర్యవేక్షణలో తనిఖీ బృందం పొన్నాడ శివారు కోనపాపపేటలో శుక్రవారం గ్రామస్తుల సమక్షంలో ఎంపికచేసిన పనుల విధానం, వాటి ప్రాముఖ్యతపై శ్రామికులకు మ్యాపింగ్ ద్వారా అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధి శ్రామికులు, మేట్లు, ఫీల్డు అసిస్టెంట్లతో ఏపీవో కొండలరావు సమావేశమయ్యారు. వంద రోజులు పని దినాలు పూర్తి చేసుకున్న శ్రామికులకు కనీస వేతనం రూ.307 వచ్చేలా చూస్తామన్నారు. యోగాంధ్రలో భాగంగా శ్రామికులతో యోగా సాధన చేయించారు. ఎంపీపీ కారే సుధాశ్రీనివాసరావు, సర్పంచ్ బండి రాణిదావీదు, జనసేన నాయకులు తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, పల్లేటి బాపన్నదొర, ఫీల్డు అసిస్టెంటు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



బాలుడి తల్లిదండ్రులకు నగదు అందజేస్తున్న దాతలు

బాలుడి వైద్యానికి రూ.60వేలు సహాయం

కాకినాడ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం చిన్న స్వామినగర్ బుల్లబ్బాయిరెడ్డి కాలనీకి చెందిన ఎల్.శివ, ఝాన్సీ దంపతులు రోజువారీ కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తుంటారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో వీరి నాలుగేళ్ల కుమారుడు జానేశ్వర్ కాలి మడమ, పాదం పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యింది. బాలుడిని వైద్యం నిమిత్తం ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చగా రూ.5లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. ఆర్థిక స్తోమత లేని బాలుడి తల్లిదండ్రులు సహాయం కోసం శ్రీయువసేనను ఆశ్రయించారు. స్పందించిన శ్రీయువసేన స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు బొల్లం సతీష్, మావబ్రో ఫుడ్ లోగ్స్ అధినేత శివ, వెంకీ, రణస్థలం రమణ కలిసి... రూ.60వేలు నగదును శుక్రవారం ఆసుపత్రిలో బాలుడి తల్లిదండ్రులకు అందజేశారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సర్కిల్ నిర్మాణం

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ముత్తా గోపాలకృష్ణ వారధి చీడీల పొరవైపు నాలుగు రోడ్ల కూడలిలో రోటరీ కాకినాడ సెంట్రల్ క్లబ్ ప్రాజెక్టు చైర్మన్ ఘైలపల్లి విద్యాసాగర్ ఆధ్వర్యంలో రూ.20లక్షలతో సర్కిల్ నిర్మాణ పనులు చేపట్టారు. ఇది పూర్తవడానికి రెండు, మూడు నెలలు సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో ప్రమాదాలను నివారించే అవకాశం ఉందని పలువురు వాహనచోదకులు అభిప్రాయపడుతున్నారు.



సర్కిల్ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు



పోలేకుర్రు లాకు వద్ద సాగునీటిని విడుదల చేస్తున్న సాగునీటి సంఘాల ప్రతినిధులు

ఖరీఫ్‌కు సాగునీటి విడుదల

తాళ్లరేవు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఖరీఫ్ పంటకు సంబంధించి సాగునీటిని డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వేగేశ్న భాస్కరరాజు ఆధ్వర్యంలో శుక్రవారం విడుదల చేశారు. గంగమ్మ తల్లికి పూజలు చేసి పసుపు, కుంకుమ, చీర, గాజులను నీటిలో వదిలివేశారు. మొదటి పంట సాగుచేసే రైతులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా సాగునీరు సరఫరా కావాలని కోరుకున్నారు. నీటి సంఘాల ప్రతినిధులు అల్లూరి రామకృష్ణరాజు, సాయిరాజు, గోవిందరాజు, శ్రీనివాసరావు, సర్పంచ్‌లు నూకరాజు, రామకృష్ణ, టీడీపీ నేత టేకుమూడి లక్ష్మణరావు, ఏఈ అనూష, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

16న కాకినాడలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ వికాస ఆధ్వర్యంలో ఈ నెల 16న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. వివిధ కంపెనీల్లో జూనియర్ అక్కౌంటెంట్, టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. స్కిల్ డవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాం ద్వారా టు వీలర్ టెక్నీషియన్, లాజిస్టిక్స్‌లో శిక్షణ ఇచ్చి ఉద్యోగం కల్పిస్తారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం ఉంటుంది. ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, ఎంకాం ఉత్తీర్ణులైన 32 సంవత్సరాలలోపు అభ్యర్థులు అర్హులు. వీరికి నెలకు రూ.12 వేల నుంచి రూ.20 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుంది. ఆసక్తి గల వారు సోమవారం ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 77993 76222, 93922 84616 నెంబర్లను సంప్రదించాలన్నారు.

నాటుసారా విక్రయాలను నిరోధించలేరా

ఇంటింటికీ బెల్టు షాపు ఉంది

గొల్లప్రోలు మండల పరిషత్ సమావేశంలో సభ్యుల ఆగ్రహం



గొల్లప్రోలు మండల పరిషత్ సమావేశంలో సారా విక్రయాలపై ప్రశ్నిస్తున్న ప్రజాప్రతినిధులు

గొల్లప్రోలు రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నాటుసారా ఏరులై పారుతోందని, సంచులతో ఇంటింటికీ తిరిగి విక్రయిస్తున్నారని జడ్పీటీసీ ఉలవకాయల నాగలోవరాజు, ఎంపీపీ అరిగెల అచ్చియ్యమ్మ రామయ్యదొర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటింటికీ ఒక బెల్టు షాపు ఉందని వారు తెలిపారు. గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ అధ్యక్షత వహించారు. ఎక్సైజ్ శాఖ నుంచి బాధ్యత కలిగిన అధికారి కాకుండా హెడ్ కానిస్టేబుల్ సూర్యచంద్రరావు హాజరు కావడంపై వారు అభ్యంతరం తెలిపారు. తాము ఫిర్యాదులు చేసినా కనీస చర్యలు తీసుకోవట్లేదని మండిపడ్డారు. గ్రామాల్లో ఇంటింటికీ కుళాయి పథకంలో భాగంగా ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించినా కనెక్షన్లు ఇవ్వలేదని కొడవలి సర్పంచ్ బుర్రా రామచంద్ర, ఏకే మల్లవరం ఉప సర్పంచ్ అరిగెల మణిబాబు తెలిపారు. దీనితో వేసవిలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈకి ఫిర్యాదు చేసినా స్పందించట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ స్తంభాలు తెచ్చి నెలలు గడుస్తున్నా వేయట్లేదని ఎంపీపీ అరిగెల అచ్చియ్యమ్మ రామయ్యదొర తెలిపారు.

ఇష్టారాజ్యంగా ఉపాధి పనులు

ఇరిగేషన్ పనులను ఏ ప్రాతిపదికన చేపడుతున్నారని జడ్పీటీసీ ఉలవకాయల లోవరాజు, ఎంపీపీ ప్రశ్నించారు. తాము అడిగితే పనులు మంజూరు రాలేదన్నారని తెలిపారు. ఇప్పుడు అడుగుతుంటే పనులు అన్ని చేసేశామని చెప్తున్నారన్నారు. శివారు ప్రాంతాల్లో పనులు చేపట్టలేదని, దీనివల్ల వర్షాకాలంలో పంట పొలాలు ముంపునకు గురవుతాయని తెలిపారు. వీర్రాజు కాలువ ముందు భాగంలో తీసి వదిలివేశారని చెప్పారు. ఉపాధి హామీ పథకంలో చేసిన కాలువ పనులను ఇరిగేషన్ క్లోజర్ పనుల్లో పెట్టి బిల్లులు చేసుకుంటున్నారని వారు ఆరోపించారు. ఉపాధి పనుల డేటా ఇవ్వాలని కోరారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వాకపల్లి దేవి, వైస్ ఎంపీపీలు బత్తిన మంగ, నేమాని ఆదివిష్ణు, ఎంపీడీవో కర్రి స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో అవకతవకలపై విచారణ



బి.కొత్తూరులో విచారణ నిర్వహిస్తున్న ఏపీడీ వసంతమాధవి

పిఠాపురం రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం బి.కొత్తూరులో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై డ్వామా ఏపీడీ వసంతమాధవి శుక్రవారం విచారణ నిర్వహించారు. గ్రామంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ పలు అవకతవలకు పాల్పడుతున్నారని, నిధులు పక్కదారి పట్టించారని గ్రామస్తులు ఇటీవల పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మకు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని ఆయన డ్వామా పీడీ వెంకటలక్ష్మి దృష్టికి తీసుకురావడంతో విచారణకు ఆదేశించారు. దీనితో ఏపీడీ వచ్చి విచారణ చేపట్టారు. పంట కాలువల శుభ్రత పనుల వద్ద బోర్డుల ఏర్పాటుకు రూ.76వేలు మంజూరైతే వాటిని వినియోగించలేదని, కొబ్బరిచెట్లు వేయకుండానే వేసినట్టు చూపించారని, గట్టు పెంపకంలో నిధులు స్వాహా చేశారని, పనిచేయకుండానే మస్తర్లు వేశారని గ్రామస్తులు ఏపీడీ దృష్టికి తీసుకువచ్చారు. కూలీలకు మస్తర్లు వేసి పొలంలో పని చేయించుకుంటున్నారని, సరిగా పని కల్పించట్లేదని తెలిపారు. కూలీల నుంచి ఏపీడీ స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు. ప్రాథమికంగా కొన్ని లోపాలు గుర్తించామని, పీడీకి నివేదిక ఇస్తామని ఏపీడీ తెలిపారు. విచారణలో ఏపీవో నాయుడు తదితరులు పాల్గొన్నారు.





కాకినాడ ఆర్టీసీ డిపోలో యోగాసనాలు వేస్తున్న జిల్లా ప్రజా రవాణాధికారి, డిపో మేనేజర్, సిబ్బంది, పిఠాపురంలోని మెప్మా కార్యాలయంలో యోగా శిక్షణ

కాకినాడ, పిఠాపురంల్లో యోగా శిక్షణ

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ఉదయం ఆరు గంటలకు ఆర్టీసీ బస్టాండులో శిక్షకుడు హరీష్ ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు, డిపో మేనేజరు ఎంయూవీ మనోహర్, అసిస్టెంట్ మేనేజరు టి.బాలకృష్ణ, డీపీటీవో ఆఫీస్ అసిస్టెంట్ మేనేజరు మాలిమ్ బాషా, స్టేషన్ మేనేజరు వి.ధర్మారావు, వీఆర్వో సీహెచ్ వెంకట్‌రాజు, అధిక సంఖ్యలో సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుత్రిలో వైద్యులు, సిబ్బందికి, పాత బస్టాండు వద్ద గల మెప్మా కార్యాలయంలో అధికారులు, సిబ్బందికి, మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు యోగాలో శిక్షణ ఇచ్చారు. యోగా గురువు వనం సత్యప్రియ, ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ నీరజ, కోచ్ వెంకట్ పాల్గొన్నారు.



మహిళా ఆటో డ్రైవర్‌కు ఖాకీ యూనిఫామ్ అందజేత

సామర్లకోట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సామర్లకోటలో ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ పలువురికి ఆదర్శంగా మారిన సుజాతకు ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు ఖాకీ యూనిఫామ్ అందజేశారు. శుక్రవారం ఆమె యూనిఫామ్ ధరించి ట్రాఫిక్ ఎస్ఐకు కృతజ్ఞతలు తెలిపారు.



చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

అంగన్వాడీ కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యాసాలు

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ కాకినాడ అర్బన్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో చేరిన చిన్నారులకు నూకాలమ్మ మన్యం కమ్యూనిటీ హాలులో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ప్రీ స్కూలు విద్య పూర్తయిన వారికి గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. కొత్త సిలబస్ ప్రకారం పాఠ్యపుస్తకాలు వచ్చాయని ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీవో దయామణి తెలిపారు. తల్లులు, బాలింతలు, గర్భవతులు, చిన్నారులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

ఇంజనీరింగ్ కోర్సులపై అవగాహన

కాకినాడ రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఏపీఈఏపీసెట్‌లో అర్హులైన విద్యార్థులకు కైట్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ విద్యపై అవగాహన సదస్సు కాకినాడ ఫ్యాబిన్ ఫుడ్ హాల్లో ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న జేఎన్టీయూకే మాజీ వీసీ, సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ ఇంజనీరింగ్‌లో ఏ కోర్సుల్లో విద్యార్థులు చేరితే మంచి అవకాశాలు లభిస్తాయో వివరించారు. ప్రొఫెసర్ శిష్టా మూర్తి వ్యక్తిత్వవికాసంపై, ప్రొఫెసర్ నున్న గోపి ఇంజనీరింగ్‌లో సర్టిఫికేషన్‌పై అవగాహన కల్పించారు. ప్రొఫెసర్లు జాయ్, సత్య కెరీర్ డవలప్‌మెంట్ గురించి వివరించారు. ఈ నెల 24వ తేదీ వరకు జరిగే ప్రతిరోజూ జరిగే సదస్సుకు విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా హాజరు కావచ్చని కైట్ విద్యా సంస్థల చైర్మన్ విశ్వం తెలిపారు.



ప్రదర్శన నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు, విద్యార్థులు

వర్మీకంపోస్టు వినియోగంతో అధిక దిగుబడులు

పెద్దాపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): వర్మీకంపోస్టు సేంద్రియ ఎరువును పంటలకు వినియోగిస్తే సాగులో నాణ్యమైన అధిక దిగుబడులు పెంచుకోవచ్చని పెద్దాపురం వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ సుజాత తెలిపారు. శుక్రవారం ఇక్కడ వ్యవసాయ పరపతి సంఘ ఎరువుల డీలర్ల సర్టిఫికెట్ శిక్షణలో భాగంగా విజ్ఞాన యాత్ర నిర్వహించారు. ‘వర్మీకంపోస్టు-సేంద్రియ ఎరువుల ఆవశ్యకత’ అంశంపై డాక్టర్ సుజాత మాట్లాడి డీలర్ల సందేహాలను నివృత్తి చేశారు. శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా వెంకట నరసింహరావు, డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయాధికారి సీహెచ్ పద్మ, ఇంజేటి సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త పుస్తకాలు అందజేత

సామర్లకోట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు నూతన అచ్చు పుస్తకాలు, నోటు పుస్తకాలను మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ యార్లగడ్డ రవిచంద్రప్రసాద్ శుక్రవారం అందజేశారు. హెచ్ఎం విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎంఈవోలు వై.శివరామకృష్ణయ్య, పట్టపగలు పుల్లయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మధ్యాహ్న భోజన పథకంలో సన్నబియ్యం అన్నాన్ని, కూరలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా మానవహక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ, ఉపాధ్యాయుడు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి పుస్తకాలు అందజేస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ రవిచంద్రప్రసాద్



తల్లికి వందనం

సామర్లకోట పట్టణంలోని సాయినగర్‌కు చెందిన గన్నెం దేవి-వీరబాబు దంపతుల కుమార్తెలు మానస (పదో తరగతి), లావణ్య (ఎనిమిదో తరగతి), కుమారుడు తేజ (ఏడవ తరగతి)లకు ‘తల్లికి వందనం’ పేరిట రూ.39వేలు బ్యాంకు ఆఫ్ బరోడాకు చెందిన ఖాతాలో జమ అయ్యాయి. వారు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పకు కృతజ్ఞతలు తెలిపారు.

-సామర్లకోట (ఆంధ్రజ్యోతి)

చంద్రబాబు చిత్రపటానికి చిన్నారుల పాలాభిషేకం

కాకినాడ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తల్లికి వందనం కార్యక్రమాన్ని అమలుచేస్తూ శుక్రవారం తల్లుల ఖాతాల్లో నగదు జమ చేసింది. ఈ సందర్భంగా 36వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి నల్లూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పెగోడా స్కూలు ఆవరణలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి చిన్నారులు పాలాభిషేకం చేశారు. హెచ్ఎం సుభాషిణి, మహిళా నాయకురాలు నల్లూరి తులసి, టీడీపీ నాయకులు ఆకెళ్ల ప్రసాద్, చాట్ల వీరబాబు, ఉప్పులూరి వీరభద్రరావు, టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గొల్లప్రోలు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఆర్‌డీఎస్ఎస్ స్కీములో గ్రామాలకు 24 గంటలు త్రీఫేజ్ విద్యుత్ సరఫరాకు విద్యుత్ లైన్ల నిర్మాణం కారణంగా శనివారం గొల్లప్రోలు మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ పెద్దాపురం ఈఈ ప్రభాకర్ తెలిపారు. చేబ్రోలు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని చెందుర్తి, వన్నెపూడి, కొడవలి గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.



మరిడమ్మకు స్వర్ణ పుష్పార్చన

పెద్దాపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో వేదపండితుల మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు జరిపారు. దేవస్థానం సహాయ కమిషనరు కురం విజయలక్ష్మి, ఆలయ సిబ్బంది రమణ, వేదపండితులు, ఆసాదులు, భక్తులు పాల్గొన్నారు.

స్పోకెన్ ఇంగ్లీషు ఉచిత శిక్షణ

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ సొసైటీ కాకినాడ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ శిక్షకుడు జె.అరవింద్ మహిళలకు స్పోకెన్ ఇంగ్లిషు ఉచిత శిక్షణ ఇస్తారని రెడ్‌క్రాస్ జిల్లా, రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు తెలిపారు. 18 సంవత్సరాలు నిండి పదో తరగతి ఉత్తీర్ణులై తెలుపు రేషన్ కార్డు కలిగిన మహిళలకు ఈ నెల 25వ తేదీ నుంచి 45 రోజులు శిక్షణ ఇస్తామన్నారు. ముందుగా దరఖాస్తు చేసుకున్న మొదటి 50మంది మహిళలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. మరిన్ని వివరాలకు 0884-2371409, 9182660025 నెంబర్లను సంప్రదించాలన్నారు.

కాలువ తవ్వకం పనులు ప్రారంభం

గొల్లప్రోలు రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని కోటలంకవారి చెరువుకు చెందుర్తి నుంచి నీరు వెళ్లే కాలువలో పూడిక తొలగింపు పనులను నీటి సంఘం అధ్యక్షుడు దూళ్ల లచ్చబాబు శుక్రవారం ప్రారంభించారు. రూ.3లక్షల వ్యయంతో ఈ పనులు చేపట్టినట్టు ఆయన తెలిపారు. చెరువు ఆయకట్టు రైతులు, నీటి సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్వేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

శంఖవరం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): శంఖవరంలో శ్రీవల్లీదేవసేన సుబ్రహ్మణ్వేశ్వరస్వామి ఆలయ వార్షిక వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దాసరి లోవరాజు, పడాల కృష్ణమూర్తి, బొర్రా వరప్రసాద్, కనిగిరి బాజ్జీ, జట్లా శ్రీను, దాసరి రాజీ పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

పూర్వ విద్యార్థుల కలయిక



విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న దృశ్యం

మోతుగూడెం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలం బొడ్డగండ పంచాయతీ డొంకరాయి జిల్లా పరిషత్ పాఠశాలలో 2024- 25 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా శుక్రవారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా 2004-25లో పది ఉత్తీర్ణు లైన విద్యార్థులకు ఆర్థిక సాయం చేశారు. మొదటి బహుమతిగా రూ.5వేలు, రెండో బహుమతిగా రూ.3వేలు, మూడో బహుమతిగా రూ.2 వేలు అందజేశారు. అనంతరం పలువురు మాట్లాడారు. అలాగే ఉత్తీర్ణులైన 20 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 1000 చొప్పున సాయం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయుడు టి.శ్రీనివాస రావు, సీనియర్ ఉపాధ్యాయులు ప్రవీణ్ నాయక్, సర్పంచ్ సంధ్యారాణి, ఎంపీటీసీ కనక రమణ, డొంకరాయి ఎస్ఐ శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

'కూటమి' సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటు

దేవీపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ నిరుద్యోగులకు జీవో నెంబర్ - 3 పునరుద్ధరించి ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామన్న ఎన్నికల ముందు అరకు సభలో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ ఏమైందని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ ప్రశ్నించారు. శుక్రవారం ఆయన దేవీపట్నంలో విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సుమారు 4,200 టీచర్ పోస్టులను మినహాయించి, ఆదివాసీలకు ప్రత్యేక డీఎస్సీ ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. ఆదివాసీల ఉద్యమం ఒత్తిడితో ప్రభుత్వం స్పందించి తాత్కాలికంగా టీఏసీ ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ ఏర్పాటు చేసి నెల రోజులు కావస్తున్నా ... నేటికీ షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టంపై తీర్మానం చేయలేదన్నారు. ఇకనైనా ఆ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఈయనతో పాటు జేఏసీ సభ్యులు ఉన్నారు.

'గిరి' గ్రామాల్లో నీరు, వైద్యం, అందించాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ, తదితరులు

రంపచోడవరం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ గ్రామాల్లో తాగు నీరు, వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ కోరారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డివిజన్ కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఏజెన్సీలో ప్రధానంగా మౌలిక సదుపాయాలు పూర్తిగా కరువయ్యాయన్నారు. ఇటీవల రాజవొమ్మంగి మండలంలో రెండు శిశు మరణాలు జరిగాయన్నారు. కార్యక్రమంలో డివిజన్ పార్టీ కార్యదర్శి జుత్తుక కుమార్, కమిటీ సభ్యులు దుర్గ, వీరన్న, గంగరాజు, దినేష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సుబ్బారావు పాల్గొన్నారు.

టేకులబోరులో పోలవరం గ్రామసభ



నిర్వాసితుల పేర్లు చదువుతున్న ఎస్‌డీసీ నరసరయ్య

కూనవరం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకులబోరులో శుక్రవారం పోలవరం గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామంలో పెండింగ్‌లో ఉన్న ఇంటికి సంబంధించి 650 కుటుంబాలకు ఇంటి అంచనా పత్రాలను గతంలో అందజేశారు. ఆ పత్రాలకు అంగీకారం తెలుపుతున్నట్టు నిర్వాసితులు అధికారులకు ఈ గ్రామసభలో పత్రాలను అందజేశారు. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు సూచించారు. ఎస్‌డీసీ నరసరయ్య, తహశీల్దార్ శ్రీనివాస్, కూటమి నాయకులు ఎడవల్లి భాస్కరరావు, బరపాటి ప్రకాష్, గడ్డిపాటి ప్రసాద్, దాసరి సరేంద్ర, ఎంపీటీసీ బండారు సాంబశివ రావు, తదితరులు పాల్గొన్నారు.

'అధికారులు, ప్రజాప్రతినిధులను ఉపేక్షించబోం'

రంపచోడవరం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మన్యంలో అక్రమ కూల్చివేతలలో గిరిజనేతరులకు మద్దతుగా నిలుస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులను ఉపేక్షించబోమని ఆదివాసీ సంఘాల కూటమి నాయకులు వెదుళ్ల లచ్చిరెడ్డి, తీగల బాబురావు శుక్రవారం ప్రకటనలో హెచ్చరించారు. అక్రమ కట్టడాల కూల్చివేతలో కొంతమేర మినహాయింపు ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌పై ఒత్తిడి చేస్తున్నారని, గిరిజన చట్టాలను సక్రమంగా అమలు చేసే బాధ్యత అధికారులపై వుందన్నారు. ఈయనతోపాటు తదితరులు ఉన్నారు.

చంద్రబాబు, పవన్‌క చిత్రపటాలకు పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న విద్యార్థుల తల్లులు

కూనవరం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): బడికి వెళ్తున్న ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం కింద రూ. 13 వేలు అకౌంట్లలో జమ చేసిన సందర్భంగా మండలంలోని పోచవరం కాలనీలో ఆయా విద్యార్థుల తల్లులు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఇచ్చినమాట నిలబెట్టుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఎడవల్లి కన్యకాపరమేశ్వరి, విద్యార్థుల తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

దేవీపట్నం ఎంపీడీవోగా సాల్మన్‌రాజు బాధ్యతలు

దేవీపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): దేవీపట్నం ఎంపీడీవోగా ఎస్.సాల్మన్‌రాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం జిల్లా గుమ్మలక్ష్మీపురంలో పనిచేస్తూ ఇక్కడికి వచ్చారు. నూతన ఎంపీడీవో మాట్లాడుతూ తాను ఏజెన్సీ ప్రాంతానికి చెందిన వ్యక్తిని అని, ఈ ప్రాంతంలో పనిచేసే అవకాశం రావడం అదృష్టమన్నారు. అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మండలాభివృద్ధికి కృషిచేస్తానన్నారు.

ర్యాష్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు

రౌతులపూడి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): బైక్ రేస్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని రౌతులపూడి ఎస్ఐ వెంకటేశ్వరరావు బైక్ యాజమానులను హెచ్చరించారు. శుక్రవారం గిడజాం రహదారిలో త్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, లైసెన్స్, ర్యాష్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి జరిమానాలు విధించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ఏలేశ్వరం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): యర్రవరం గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి శుక్రవారం పరిశీలించారు. మండల పరిషత్ నిధులతో ఆలయ ప్రాంగణంలో టైల్స్ వేస్తున్న పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. టీడీపీ నాయకులు బస్వా ప్రసాద్, మైరాల కనకారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గండేపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బొర్రంపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న మల్లేపల్లి గ్రామానికి శనివారం ఉదయం8నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈ డి.వీరభద్రరావు, గండేపల్లి ఏఈ కిరణ్‌కిషోర్ తెలిపారు. గ్రామంలో 24గంటలు త్రిఫేజ్ కరెంటు ఇచ్చేందుకు లైన్ల మరమ్మతుల వల్ల సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన

గండేపల్లి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోర్పు సాయితేజ్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరకాలంలోనే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. వైసీపీ పాలనలో ఐదేళ్లు కూడా ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి రాష్ట్రాన్ని అయోమయంలో పడేశారన్నారు. కూటమి ప్రభుత్వం పెట్టుబడులు తీసుకువచ్చి ఆదాయ వనరులు సృష్టిస్తూ సూపర్‌సిక్స్ పథకాలు ప్రతీ ఒక్కరికీ అందేలా చేయడంతో అంచెలంచెలుగా అభివృద్ధిని మెరుగుపరుస్తుందన్నారు. పింఛన్లు పెంచి, అధ్వానంగా ఉన్న రోడ్లను నిర్మించారని, మరోన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఇప్పుడు తల్లికి వందనం అమలు చేశారని, ఇలా ఒక్కొక్కటిగా ఇచ్చిన హామీలకు మించి పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అభివృద్ధిని చూడలేక వైసీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

తల్లికి వందనం.. తల్లుల హర్షాతిరేకాలు

ప్రత్తిపాడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి):

తల్లికి వందనం ఆసరా అయింది
మాదేశాంతి, ప్రత్తిపాడు



తల్లికి వందనం పథకంలో మా ఇద్దరు పిల్లలకు రూ.26వేలు సొమ్ము నా బ్యాంక్ ఖాతాల్లో పడ్డాయి. గతంలో 7వ తరగతి, 9వ తరగతి చదివే మా పిల్లలు చదువులకు గతంలో వైసీపీ ప్రభుత్వం అమ్మఒడి పథకంలో ఒక్కరికే రూ.13వేలు బ్యాంక్ ఖాతాలో పడింది. దీని వల్ల ఇద్దర్ని చదివించడం ఎంతో కష్టంగా మారింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ఇచ్చిన మాట ప్రకారం మా ఇద్దరి పిల్లలకు మంజూరు చేయడం ఎంతో సంతోషదాయకం.

కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు
బుద్దండ వెంకటలక్ష్మి, ధర్మవరం



ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మా కుటుంబంలో షణ్ముఖ మానేశ్వర్ 4వ తరగతి, అవినాష్ 3వ తరగతి చదువుతోన్న ఇద్దరికి రూ.13వేలు చొప్పున రూ.26వేలు బ్యాంక్ ఖాతాలో జమ అయింది. చేనేత కార్మికుడుగా తన భర్త ప్రసాద్ కష్టపడి జీవనం సాగిస్తున్న మా కుటుంబానికి పిల్లల విద్య కోసం రూ.26వేలు బ్యాంక్ ఖాతాలో వేయడం పట్ల కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నాం

చంద్రబాబు మేలు జన్మలో మర్చిపోము
శెట్టిబత్తుల వెంకటలక్ష్మి



చంద్రబాబు మేలు జన్మలో మర్చిపోలేము. నా ఇద్దరి పిల్లలకు రూ.26వేలు తల్లికి వందనం బ్యాంక్ ఖాతాలో పడ్డాయి. హైస్కూల్ విద్య అభ్యసించే తమ పిల్లలను మంచి చదివించుకునేందుకు ఈసొమ్ములు ఖర్చు చేస్తాము. వారి విద్యా భవిష్యత్‌కు ఎంతో ఆధారంగా తల్లికి వందనం పేరుతో ఎన్నికల హామీని అమలు చేసిన సీఎం చంద్రబాబుకు రుణపడి ఉంటాం

విద్యకు పెద్ద పీట
బొండా లచ్చమ్మ

గండేపల్లి: ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకుని విద్యకు పెద్ద పీట వేశారు. నాకు ఇద్దరు పిల్లలు. తల్లికి వందనం ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం రూ.26వేలు నా ఖాతాలో జమ చేసింది. మా ఆర్థిక పరిస్థితి బాగోలేదు. తల్లికి వందనంతో ఉన్నత చదువులు చదివించుకోవచ్చనే ధీమా వచ్చింది. నాకు ఎంతో సంతోషంగా ఉంది. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నా.



చేతల ప్రభుత్వం
కంచర్ల చక్రవేణి, మల్లేపల్లి



ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మందికి తల్లికి వందనం వేయరని కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని పలువురు అన్నారు. నా ఇద్దరు అమ్మాయిలను ఎలా చదివించుకోవాలనే బెంగ ఉండేది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రూ.26వేలు నా ఖాతాలో జమ చేసింది. మాటల ప్రభుత్వం కాకుండా చేతల ప్రభుత్వమని నిరూపించింది. నాకు ఎంతో ఆనందంగా ఉంది.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు
దాసరి రామతులసి, సుబ్బయమ్మపేట



కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకుంది. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తానన్న మాట ప్రకారం ఇచ్చారు. నాకు ఇద్దరు పిల్లలకు రూ.26వేలు ఖాతాలో జమ అయినట్లు మెసేజ్ వచ్చింది. గత ప్రభుత్వాలు ఎప్పుడు ఇలా ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకుందన్నారు. ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసింది.

కోటనందూరు, (ఆంధ్రజ్యోతి):

ఫీజుల భారం తగ్గింది.
దుత్తర్తి రోహిణి, కె.కొట్టాం



మాది కొత్తకొట్టాం గ్రామం. నా ముగ్గురు పిల్లలు చదువుకుంటున్నారు. నా ఖాతాలో తల్లికి వందనం ముగ్గురికి కలిపి రూ.39వేలు పడ్డాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మా కష్టాలు తీరాయి. పిల్లలకు ఫీజుల భారం తగ్గింది. మళ్లీ చంద్రబాబు అధికారంలోకి రావాలని కోరుకుంటున్నాము.

మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం
రెడ్డిమంగ, కెకొట్టాం



ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. మా ఇద్దరు పిల్లలకు రూ.26వేలు వచ్చాయి. చంద్రబాబుకు రుణపడి ఉంటాం.

ఎంతో ఆనందం
తల్లి ముప్పిడి రత్నకుమారి, ఏలేశ్వరం.



ఏలేశ్వరం, (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ప్రభుత్వం నెరవేర్చడంతో ఎంతో ఆనందంగా ఉంది. చదువుకు ఇబ్బంది పడే అవసరం లేకుండా పోయింది. ఏవిధమైన ఆటంకం లేకుండా పిల్లలు చదువుకునే స్తోమత వచ్చింది.

హర్షించదగ్గ విషయం
తల్లి కొసన వరలక్ష్మి, ఏలేశ్వరం.



ఏలేశ్వరం : గత ప్రభుత్వంలో కేవలం ఒక్కరికే తల్లికి వందనం పథకం వర్తించేది. ఇప్పుడు ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి వర్తింప చేయడం చాలా హర్షించదగ్గ విషయం. మా పిల్లలు ముగ్గురికి తల్లికి వందనం పథకం చేకూరింది. రాష్ట్ర ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

ప్రభుత్వ సహాయంతో స్కూల్ భారం గట్టెక్కింది
సీహెచ్ అనంతలక్ష్మి, తుని



తుని రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విడుదల చేసిన తల్లికి వందనం పథకంలో నా ఇద్దరు పిల్లల పేరిట రూ.26వేలు నా ఖాతాకు జమ అయింది. మధ్య తరగతి కుటుంబం ఫీజులు, యూనిఫాం, బుక్స్ వంటి చదువుకు సంబంధించిన అవసరాలు మోయలేని భారంగా మారాయి. ఈఏడాది పిల్లల చదువులు ఎలాగని కలత చెందాను. సరైన సమయంలో ప్రభుత్వం అందజేసిన నగదుతో నా ఇద్దరు పిల్లలు అవసరాలు తీర్చగలిగాను. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు

కాపు సేవా సమితి రాష్ట్ర యువత అధ్యక్షుడిగా సైతిన



జగ్గంపేట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): భారతీయ కాపు సేవా సమితి రాష్ట్ర యువత అధ్యక్షుడిగా జె.కొత్తూరుకు చెందిన సైతిన నాగేశ్వరరావు నియమితులయ్యారు. సమితి వ్యవస్థాపక, జాతీయ అధ్యక్షుడు కాలవ వెంకటేశ్వరరావు శుక్రవారం నియామకపత్రాన్ని అందజేశారు.

ఏలేశ్వరంలో అన్నదానం

ఏలేశ్వరం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో శుక్రవారం మహాఅన్నదానం చేశారు. శ్రీఅనంతలక్ష్మీ సమేత సత్యనారాయణస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా అన్నవరం దేవస్థానం నేతృత్వంలో ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ గణపతి, సత్యదీక్ష ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు, కౌన్సిలర్ మూదినారాయణ స్వామి, వాగు రాజేష్ పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

ఏలేశ్వరం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మృతిచెందిన వారికి శాంతి చేకూరాలని పట్టణంలో శుక్రవారం కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. పాత బస్‌స్టాండ్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా బాలాజీచౌక్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్, మాజీ కౌన్సిలర్ సుంకర రాంబాబు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పైల విజయ్ కుమార్, శిడగం వెంకటేశ్వరరావు, గోళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

ఏలేశ్వరం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో 1వ వార్డులో ఇటీవల పూరిల్లు దగ్ధమవ్వడంతో బాధిత దెయ్యాల రాజు కుటుంబాన్ని శుక్రవారం రెవెన్యూ అధికారి అవసరాల కిశోర్, కౌన్సిలర్లు మూది నారాయణ స్వామి, బొదిరెడ్డి గోపి, రాయుడు చిన్న, యండగుండి నాగబాబు పరామర్శించి బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు.

పుస్తకాలు పంపిణీ చేయాలి

ప్రత్తిపాడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫారం, విద్యాసామగ్రిని వెంటనే పంపిణీ చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు విద్యాశాఖాధికారులకు విజ్ఞప్తి చేశారు. ప్రత్తిపాడు ఎంఈవో వి.రాజబాబుకు ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠ, నరసింహమూర్తి శుక్రవారం వినతిపత్రం అందజేశారు.

పనికి తగిన వేతనాలు పొందాలి

కిర్లంపూడి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలు కొలతలు ప్రకారం పనిచేసి వేతనాలు పొందాలని ఉపాధి హామీ జేఈ కుమారి, టెక్నికల్ అసిస్టెంట్ సునీత అన్నారు. శృంగరాయునిపాలెంలో శుక్రవారం ఉపాధి కూలీలు మస్టర్లను పరిశీలించారు. కాలువపూడిక పనులు సక్రమంగా చేసినప్పుడే తగిన కూలీలు పొందవచ్చన్నారు. ఫీల్డు అసిస్టెంట్ సంతోష్ పలువురు ఉన్నారు.

అడ్డకొండ భూములను పేదలకు కేటాయించాలి

● రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల



మల్లిసాలలో మాట్లాడుతున్న రైతు కూలీ సంఘం నాయకుడు కర్నాకుల

జగ్గంపేట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అడ్డకొండ భూముల కోసం నాలుగు దశాబ్దాలుగా పోరాడుతున్న మల్లిసాల, కే.గోపాలపురం పేదలకు ఆ భూములు కేటాయించి, పట్టాలు మంజూరు చేయాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం మల్లిసాల అడ్డకొండ భూముల్లో రైతు కూలీలతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆర్‌సీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్ అధ్యక్షత వహించగా వీరాంజనేయులు మాట్లాడారు. అడ్డకొండ భూములను దళిత, గిరిజన, ఇతర పేదలకు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్‌సీఎస్ రాష్ట్ర నాయకులు కొండ దుర్గారావు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వల్లూరు రాజబాబు, ఏఐఎఫ్టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుంచె అంజిబాబు, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కడితే సతీష్, ప్రగతిశీల మహిళా సంఘం స్త్రీ విముక్తి కన్వీనర్ డొక్కులూరి సంగీత, రెడ్డి దుర్గాదేవి, ఆర్‌సీఎస్ నాయకులు కర్నాకుల రామలింగేశ్వరరావు, దేశెట్టి సురేష్, జాను, అబ్బులు, వేమగిరి వెంకటేశ్వరరావు, ఆకుమర్తి పెద్ద, పందిరి నాగార్జున, కృష్ణ పాల్గొన్నారు.

కష్టపడి పని చేస్తే టీడీపీలో సముచిత స్థానం



మాట్లాడుతున్న యనమల రామకృష్ణుడు

తుని రూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): కష్టపడి పని చేసే వారికి పార్టీలో సముచిత స్థానం ఉంటుందని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. పార్టీ సంస్థాగత వ్యవహారాలపై తుని నియోజకవర్గానికి చెందిన పలువురు కీలక నాయకులతో తేటగుంట క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రజా అవసరాలను గుర్తించి వాటిని పరిష్కరిస్తూ ప్రజలతో మమేకమై ఉండాలని సూచించారు. తాగు, సాగు నీటి అవసరాలను గట్టి ఎక్కించి ఈ ఖరీఫ్‌లో నీటి ఎద్దడి లేకుండా ఎమ్మెల్యే యనమల దివ్య ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నారన్నారు. సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు యనమల రాజేష్, చింతమనీడి అబ్బాయి, సుర్ల లోవరాజు, గాడి రాజబాబు, దంతులూరి శ్రీనివాస రాజు, గంటల చిన్నారావు, తమరాన సత్యనారాయణ, తమరాన రామకృష్ణ, సర్ల బోడయ్య తదితరులున్నారు.

జనసేన క్రియాశీలక సభ్యత్వ కిట్ల పంపిణీ



జగ్గంపేట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): కాట్రావులపల్లి ఉమర్ అలీషా మందిరంలో శుక్రవారం జనసేన పార్టీ క్రియాశీలక సభ్యులకు కిట్ల పంపిణీ చేశారు. జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామం నుంచి 610సభ్యత్వాలు చేసిన కార్యకర్తలను అభినందించారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు సుంకర శ్రీనివాస్, పార్టీ నాయకులు గవర సుధాకర్, దాడి మణికంఠ, తోట సంతోష్, నార్ల దినేష్, గోలగాని లోవరాజు, తోట వెంకన్న, సుంకర తారక్, మునస దుర్గారావు, అడపా మహేష్, మాదారపు వీరబాబు, మెడిబోయిన గంగాధర్, గోన శివ, కురుమల్ల నాగేశ్వరావు పాల్గొన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న రామవరం గ్రామ మాజీ సర్పంచ్ మండపాక చిన్నాను తుమ్మలపల్లి రమేష్ శుక్రవారం పరామర్శించారు. ఆయన వెంట పాఠంశెట్టి రమేష్, మాదారపు వీరబాబు, అడ్డూరి పద్మారాజ్ ఉన్నారు.

కలెక్టరేట్ ఎదుట కుమ్మరిలోవ గ్రామస్తుల ధర్నా

కలెక్టరేట్ (కాకినాడ), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తుని మండలం కుమ్మరిలోవలో వెనుకబడిన కులస్తులకు ఇచ్చిన భూములను లాక్కునేందుకు పెత్తందారులు ప్రయత్నం చేస్తున్నారని, వారికి సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కాకినాడ కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం దళితలకు ఇచ్చిన మామిడి తోటలను నరికివేస్తున్న పెత్తదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో దశాబ్ద కాలంగా వ్యవసాయం చేసుకుంటు న్నామన్నారు. తమ భూములపై కన్నేసి తప్పుడు రికార్డులను సృష్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం అందజేశారు

మురారిలో పోలీసుల కార్డెన్ అండ్ సెర్చ్

గండేపల్లి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మురారిలో శుక్రవారం జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, గండేపల్లి ఎస్ఐ యువి శివనాగబాబు సిబ్బందితో కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. 55లీటర్ల సారాతో వ్యక్తిని అరెస్టు చేసి, 400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశారు. కేసు నమోదు చేశారు. అలాగే కొత్త, అనుమానాస్పద వ్యక్తుల వివరాలు అడిగి నమోదు చేసుకున్నారు. అనుమానిత వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పెద్దిపాలెంలో ...

ప్రత్తిపాడు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు సీఐ సూర్యఅప్పారావు ఆధ్వర్యంలో పెద్దిపాలెంలో శుక్రవారం కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. పాత కేసుల్లో నిందితులుగా ఉండి తప్పించుకుని తిరుగుతున్న ముగ్గురిని అరెస్ట్ చేశారు. పోలీసులు, ఎక్సైజ్ శాఖలు సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో కాకినాడ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కుమారి మౌనిక, స్థానిక సీఐ బి.సూర్యఅప్పారావు, ఎస్ఐలు లక్ష్మీకాంతం, వంశీరామ్, నరసింహారావు, ఎక్సైజ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'ఆదిత్య'లో ప్రారంభమైన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం'

గండేపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో యూనివర్సల్ హ్యూమన్ వాల్యూస్ సెల్ ద్వారా ఏఐసీటీయూ సౌజన్యంతో యూనివర్సల్ హ్యూమన్ వాల్యూస్ అనే అంశంపై ఎనిమిది రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ప్రారంభమైనట్టు డిప్యూటీ ప్రోచాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఏఐసీటీయూ ప్రతినిధి ప్రొఫెసర్ ఎన్.సునీల్‌కుమార్ నేతృత్వంలో ఈకార్యక్రమం జరుగుతుందన్నారు.

ఎన్‌సీసీ శిక్షణా శిబిరం

ఆదిత్య యూనివర్సిటీ ప్రాంగణంలో ఎయిర్ స్క్వేర్, ఎన్‌సీసీ సంయుక్త వార్షిక శిక్షణ శిబిరం జరుగుతుంది. ఈనెల11న 400మంది క్యాడెట్లతో ప్రారంభమైన శిబిరం ఈనెల20వ వరకు జరగనుంది. క్యాంపు కమాండెంట్ గ్రూప్ కెప్టెన్ పి.ప్రవీణ్‌బాబు శిబిరం లక్ష్యాలను క్యాడెట్లకు వివరించారు.

20లోపు బయోమెట్రిక్ పూర్తి చేసుకోవాలి

గండేపల్లి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకానికి అర్హత కలిగిన ప్రతీ రైతు రైతు సేవా కేంద్రంలో ఈనెల 20వ తేదీలోపు బయోమెట్రిక్ వేయాలని ఏవో సద్గురుమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బయోమెట్రిక్ పూర్తికాకపోతే అర్హత కోల్పోతారన్నారు.

యనమలతో చిక్కాల సమావేశం

తుని రూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడితో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఇరువురు జిల్లాలో రాజకీయ అంశాలపై చర్చించుకున్నారు.

ఎలక్ట్రికల్ స్కూటీ అందజేత

ప్రత్తిపాడు, జూన్13(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులోని దివ్యాంగుడు మణికుమార్‌కు రూ.30వేలు విలువైన ఎలక్ట్రికల్ స్కూటీని శుక్రవారం సీబీఎం చర్చి అధ్యక్షుడు డేవిడ్ స్వాన్ అందజేశారు. సెయింటరీ బాపిస్ట్ చర్చిలో జరిగిన సేవా కార్యక్రమంలో సంఘ కాపరి పి.ఆనందరావు, స్థానిక లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఇంజనీర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

టెండర్-కమ్-బహిరంగ వేలం ప్రకటన

కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడి గ్రామంలో గల శ్రీరాజా వత్సవాయి బుచ్చి సీతాయమ్మ మహారాణి బహద్దరు వారి సత్రమునకు చెందిన రౌతులపూడి గ్రామంలో గల వివిధ సర్వే నెంబర్లలో గల య.238-36లు భూములకు 3సంవత్సరముల కాలమునకు అనగా 2025-26 నుండి 2027-28 వరకు కౌలుకు ఇచ్చుటకు దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో ఈక్రింది తెల్పిన విధముగా సత్రము కార్యాలయము వద్ద టెండరు-కం-బహిరంగ వేలం నిర్వహించబడును. ఈక్రింది తెల్పిన విధముగా ధరావత్తులు చెల్లించి, పాట షరతులకు లోబడి పాటలో పాల్గొనవలసినదిగా కోరడమైనది.

వ.నెం.	విస్తీర్ణము	ధరావత్తు	కౌలుకాలపరిమితి	పాట జరుగు ప్రదేశము & సమయము
1	116-00 39(Bits)	10,000/-, 5,000/-, 2,000/-	2025-26 నుండి 2027-28	శ్రీసత్రము వద్ద దీ.23-6-2025 ఉదయం గం.10-00ల నుండి
2	58-09 35(Bits)	3,000/-	2025-26 నుండి 2027-28	శ్రీసత్రము వద్ద దీ.24-6-2025 ఉదయం గం.10-00ల నుండి
3	48-31 29(Bits)	3,000/-	2025-26 నుండి 2027-28	శ్రీసత్రము వద్ద దీ.25-6-2025 ఉదయం గం.10-00ల నుండి
4	48-31 19(Bits)	2,000/-	2025-26 నుండి 2027-28	శ్రీసత్రము వద్ద దీ.26-6-2025 ఉదయం గం.10-00ల నుండి

ముఖ్య షరతులు :- 1.ఈ బహిరంగ వేలం హిందూ దేవదాయ-ధర్మదాయ చట్టం 30/87, G.O.MS.NO.425నకు లోబడి దేవదాయ-ధర్మదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో కార్యనిర్వహణాధికారి వారిచే నిర్వహించబడును. 2.పాటలో పాల్గొనువారు ముందుగా ప్రథమ ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనవలెను, పాట పూర్తి అయిన వెంటనే ఒక సంవత్సరం శిస్తు వెంటనే చెల్లించవలెను. 3.దేవస్థానమునకు బకాయిలు ఉన్నవారుకానీ, ఇతర లావాదేవీలు ఉన్నవారుకానీ పాటలో పాల్గొనరాదు. 4.పాటదారుడు తన స్థితి గతులను తెలుపు ఆధార్ మరియు రూ. 2,00,000 /-లు సాల్వేన్సీ పాటకి ముందు సమర్పించవలెను. 5.ఏ కారణము చేతనైనా పాట వాయిదా వేయుటకు గానీ, నిలుపుదల చేయుటకు గానీ సత్రం అధికారులకు అధికారం కలదు. మిగిలిన షరతులు కార్యాలయము పని వేళలలో తెలుసుకొనవచ్చును.

కత్తిపూడి,
తేది.13-06-2025.

కార్యనిర్వహణాధికారి